


సిరుల శ్రీలక్ష్మి.. మహిలో మాలక్ష్మి

జగన్మాత దర్శనానికి పోటెత్తిన భక్తజనం


ఆరు రోజుల్లో 4.30 లక్షల మందికి పైగా భక్తుల రాక



నృత్య నీరాజనం...



విజయవాడ దుర్గగుడిలో శరన్నవరాత్రి వేడుకల్లో ఆరో రోజు మంగళవారం మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. మంగళప్రదమైన మహాలక్ష్మీదేవిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వేకువన 4 గంటల నుంచి క్యూలైన్లలో బారులు తీరి అమ్మను దర్శించుకున్నారు. రాత్రి 11 గంటల వరకూ దుర్గమ్మ దర్శనానికి భక్తులను అనుమతించారు. మహాలక్ష్మిని దర్శిస్తే భక్తులకు ఐశ్వర్యప్రాప్తి, విజయం లభిస్తాయనేది నమ్మకం. ఉదయం నుంచి రాత్రి వరకు లక్ష మందికి పైగా భక్తులు జగన్మాతను దర్శించుకున్నారు. ఉత్సవాల ఆరు రోజుల్లో 4.30 లక్షల మందికి పైగా భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నట్లు అంచనా. మంగళవారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, సారె తెచ్చి అందజేశారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అమ్మను దర్శించుకున్నారు. బుధవారం మూలానక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి రూపంలోని దుర్గమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ✪ మంగళవారం అర్ధరాత్రి దాటాక సరస్వతీదేవి రూపంలో అమ్మవారి అలంకారం పూర్తవగానే భక్తులను దర్శనానికి అనుమతించారు. రాత్రి నుంచే వేల మంది భక్తులు తరలివచ్చి వినాయక ఆలయం వద్ద ఉన్న బ్యారక్‌లలో వేచి ఉన్నారు. వారిని అర్ధరాత్రి 12 గంటలు దాటాక క్యూలైన్లలోకి వదిలారు.


నగరోత్సవం

భక్తజన సేవలో...

అమ్మ వారి దర్శనానికి తరలివస్తున్న లక్షల మంది భక్తుల కోసం నిత్యం ఉచిత అన్నదానం, ప్రసాదాలు, పాలు, నీళ్ల సహా భారీగా మౌలికవసతులను ఏర్పాటు చేశారు. రోజూ 20 వేల మందికి పైగా అన్నప్రసాదం అందిస్తున్నారు. గత ఆరు రోజుల్లో లక్ష మంది వరకూ భక్తులు అన్నదానం స్వీకరించారు. ఉచిత ప్రసాదాన్ని నిత్యం 12 వేల మందికిపైగా అందిస్తున్నారు. ఇప్పటి వరకు 72వేల మందికి పంపిణీ చేశారు. ఆరు రోజుల్లో 12 లక్షల మంచినీటి ప్యాకెట్లు, ఆరున్నర లక్షల అర లీటరు వాటర్ బాటిళ్లు అందజేశారు.

– ఈనాడు, డిజిటల్ – అమరావతి, న్యూస్‌టుడే – ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక

నేడు సరస్వతీదేవిగా..

దసరా ఉత్సవాల్లో కీలకమైన మూలానక్షత్రం సందర్భంగా దుర్గమ్మ సరస్వతీదేవి రూపంలో బుధవారం దర్శనమివ్వనుంది. మూలానక్షత్రం అమ్మవారి జన్మ నక్షత్రం. మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతి శక్తి స్వరూపాలతో దుష్టసంహారం చేసిన తర్వాత దుర్గాదేవిని శరన్నవరాత్రి ఉత్సవాలలో మూలానక్షత్రం రోజున వాగ్దేవతా మూర్తి అయిన సరస్వతీ రూపంలో అలంకరిస్తారు. సరస్వతీదేవిని దర్శించుకోవడం ద్వారా విద్యార్థులు వాగ్దేవి అనుగ్రహం పొంది సర్వ విద్యలలో విజయం సాధిస్తారని నమ్మకం. మూలానక్షత్రం నుంచి విజయదశమి వరకు విశేష పుణ్య దినాలుగా భావించి దుర్గమ్మను ఆరాధిస్తారు. భక్తజనుల అజ్ఞానాన్ని పారదోలి జ్ఞానజ్యోతిని వెలిగించే జ్ఞాన ప్రదాయిని సరస్వతీదేవి. సరస్వతీదేవి దర్శనం... అఖిల విద్యాభ్యుదయ ప్రదాయకం.


వెండి వీణతో విద్యాధరిగా కొలువుదీరిన జగన్మాత కనకదుర్గమ్మ (పాతచిత్రం)


చదువుల తల్లికి అలంకరించనున్న వీణ

పారదర్శకంగా.. దరఖాస్తుల స్వీకరణ



- ఉమ్మడి జిల్లాలో 4,420 దరఖాస్తులు
- ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు వెల్లడి...

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరుగుతోందనీ, ఎవరైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం సాయంత్రానికి ఉమ్మడి జిల్లాలో 236 మద్యం దుకాణాలకు.. 4,420 దరఖాస్తులు అందాయనీ, ఇంకా కొన్ని పరిశీలనలో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంత దుకాణాలకు తక్కువ దరఖాస్తులు వచ్చాయని, వ్యాపారులు సిండికేట్ అయినట్లు, బెదిరింపులు తమ దృష్టికి రాలేదని స్పష్టం చేశారు. మద్యం దుకాణాలకు ఎన్టీఆర్ జిల్లాలో లాటరీ కేంద్రాన్ని ఇబ్రహీంపట్నం మార్చినట్లు వెల్లడించారు. విజయవాడలో తన కార్యాలయంలో 'ఈనాడు-ఈటీవీ'తో ఆయన మాట్లాడారు.

ఉమ్మడి జిల్లాలో 236 దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చాం. ఎన్టీఆర్ జిల్లాలో 113 దుకాణాలకు మంగళవారం సాయంత్రానికి 3,173 దరఖాస్తులు అందాయి. మరికొన్ని పరిశీలనలో ఉన్నాయి. కృష్ణా జిల్లాలో 123 దుకాణాలకు 1,247 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం వరకు గడువు ఉంది. చివరి రోజు భారీగా పడే వీలుంది. 2017-19 ఆబ్కారీ సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలో 6 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. ప్రస్తుతం దరఖాస్తులు తగ్గాయి. దీనికి కారణం దరఖాస్తు రుసుమూ కావచ్చు. గతంలో రూ. 50 వేలు మాత్రమే ఉండేది. ప్రస్తుతం రూ.2 లక్షలు (నాన్ రిఫండబుల్) ప్రభుత్వం నిర్ణయించింది. వ్యాపారులు సిండికేట్ అవుతున్నారనే వార్తలు మాదృష్టికి వచ్చాయి. కానీ అందిన దరఖాస్తులు ఆవిషయాన్ని రూఢీ చేయట్లేదు. గ్రామీణంలో దుకాణాలకు తక్కువ వచ్చాయి.

ఇబ్రహీంపట్నానికి మార్పు...

ఈనెల 14న మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులను లాటరీ ద్వారా ఎంపిక చేస్తాం. ఎన్టీఆర్ జిల్లాలో మొదట నోటిఫికేషన్‌లో తుమ్మలపల్లి కళాక్షేత్రంగా ప్రకటించాం. దసరా ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున పోలీసుల సూచనతో ఇబ్రహీంపట్నం మార్చాం. అక్కడ స్వర్ణ కన్వెన్షన్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీలు నిర్వహిస్తాం. ఈనెల 11 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించి ఆ తర్వాత పరిశీలించి జాబితా రూపొందిస్తాం. 14న ఉదయం లాటరీలు నిర్వహిస్తాం. దరఖాస్తుదారు లేదా తన తరపున అధీకృత వ్యక్తినే అనుమతిస్తాం. లాటరీ విజేత వెంటనే రిటైల్ ఎక్సైజ్ పన్నులో ఆరో వంతు సొమ్ము చెల్లించాలి. ఆపై అక్కడే ప్రొవిజనల్ లైసెన్సు ఇస్తాం. 16 నుంచి మద్యం అమ్మే వెసులుబాటు కల్పించాం. 30 రోజుల్లో బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలి. బందరులో నోబుల్ కళాశాల ఆవరణలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ నిర్వహిస్తాం.



మూడు పద్ధతుల్లో చేసుకోవచ్చు..

దరఖాస్తులను మూడు పద్ధతుల్లో చేసుకునే వీలుంది. ఎన్టీఆర్ జిల్లాలో ఎనిమిది, కృష్ణా జిల్లాలో ఎనిమిది స్టేషన్లలో నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. డీడీలు జతచేసి నిర్ణీత దరఖాస్తు పూర్తి చేసి అందించాలి. రెండో పద్ధతిలో పూర్తిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు. ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకునే వీలుంది. క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా రూ.2 లక్షలు చెల్లించాలి. మూడో పద్ధతి హైబ్రిడ్ విధానంలో సీఎఫ్ఎంఎస్‌లో రూ.2 లక్షలు చలానా చెల్లించి దాన్ని అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేయవచ్చు. మూడు పద్ధతులు ఉన్నందున అడ్డుకునే పరిస్థితి ఉండదని అభిప్రాయం. మరో మూడు రోజులు గడువు ఉండటంతో మరిన్ని వస్తాయని ఆశిస్తున్నాం.

నిబంధనల ప్రకారం..,

దుకాణాలను నిబంధనల ప్రకారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి(ఈఎస్) నిర్ణయించిన ప్రకారం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ దుకాణాల లీజు గడువు ముగిసింది. మిగిలిన సరకు మద్యం డిపోలకు తరలిస్తాం. ఫర్నిచర్ కార్పొరేషన్‌కు అప్పగిస్తాం. ఒప్పంద ఉద్యోగుల విషయం ప్రభుత్వం నిర్ణయించాలి. ప్రస్తుతం లైసెన్సు పొందిన వ్యక్తులు వాకింగ్ స్టోర్సులా ఏర్పాటు చేసుకోవాలంటే అదనంగా రూ.5 లక్షల రుసుము కట్టాలి. అలాగే గొలుసు దుకాణాలకు తావు లేకుండా నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఉంటుంది.

మూలా నక్షత్రం వేళ పటిష్ఠ బందోబస్తు

ఈనాడు డిజిటల్ - అమరావతి: మూలా నక్షత్రం పురస్కరించుకొని బుధవారం అదనంగా 1,100 మంది పోలీసులు, 110 హోల్డింగ్ టీంలు విధులు నిర్వర్తిస్తారని సీపీ రాజశేఖరబాబు వివరించారు. దుర్గాఘాట్‌లో మోడల్ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో మంత్రి ఆనం నిర్వహించిన సమీక్షలో సీపీ మాట్లాడుతూ.. కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలో ఫ్లైఓవర్ రహదారి మూసేస్తామనీ... కనకదుర్గ ఫ్లైఓవర్ పై ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. ప్రకాశం బ్యారేజీ రహదారి రద్దీ మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. భక్తులు అధికంగా రానున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచే గస్తీ పెంచుతున్నామనీ.. భక్తులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామనీ... ప్రజలు కూడా సహకరించాలని కోరారు. డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అస్త్రం అనే టీం ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని' సీపీ పేర్కొన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, ఆలయ ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.


మూలానక్షత్రం సందర్భంగా చదువులమ్మను చూసేందుకు మంగళవారం రాత్రి 11 గంటల నుంచే కంపార్ట్‌మెంట్‌లో వేచి చూస్తున్న భక్తులు

చైతన్యదీప్తి.. జ్యోత్స్న

ఆమె మరణం తీరని లోటన్న ప్రముఖులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

సుంకర జ్యోత్స్న (55) మహిళా సమస్యలపై పోరాటం చేశారని పలువురు సంతాపం ప్రకటించారు. విద్యార్థి దశ నుంచే ఆమె ఉద్యమాలు చేశారు. మహిళల హక్కుల సాధకు కృషి చేశారు. మంగళవారం రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతిచెందడం మహిళా లోకానికి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆమె భర్త సుంకర రాజేంద్రప్రసాద్ బెజవాడ బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాది. వీరికి ఇద్దరు కుమారులు ఉండగా, పెళ్లిళ్లు చేశారు.



ఇటీవల దసరా సాంస్కృతిక ఉత్సవాల్లో మాట్లాడుతున్న జ్యోత్స్న

ఉద్యమ నిర్మాతగా...

జ్యోత్స్న చిన్నప్పటి నుంచి వామపక్ష భావాలతో పెరిగారు. ఆమె తండ్రి గుళ్లపల్లి రామకృష్ణ ఇంజినీర్. కంకిపాడు మండలం తెన్నేరు గ్రామానికి చెందిన రామకృష్ణకు ఇద్దరు కుమారులు, కుమార్తె జ్యోత్స్న. 1973-74లో ఆమె మాంటిస్సోరి కళాశాలలో ఇంటర్ చదివారు. స్టెల్లా కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఎం.ఎ. లిటరేచర్ చదివారు. అప్పట్లో ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఐద్వా నగర అధ్యక్షురాలిగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా, సీపీఎం నగర కమిటీ సభ్యురాలిగా ఆమె పనిచేశారు. వామపక్ష భావాల వ్యాప్తికి కృషి చేశారు.

బాలోత్సవ్ కమిటీ.. తరుణీ తరంగాలు

పిల్లల పండుగలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించేందుకు నగరంలో 2017లో అమరావతి బాలోత్సవ్ కమిటీని ఏర్పాటు చేశారు. బాలల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏటా పండగలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కమిటీ కార్యదర్శిగా జ్యోత్స్న.. ఇతర సభ్యులతో కలిసి 6 పిల్లల పండగలను నిర్వహించారు. మహిళల కోసం 2018లో 'తరుణీ తరంగాలు' సంస్థను స్థాపించారు. ఆ సంస్థకు కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా ఆమె పనిచేశారు. 5 పండగలు నిర్వహించారు. వివిధ రంగాల్లో విస్తృతమైన సేవలు అందించిన మహిళలను సన్మానించేవారు. మహిళల హక్కులు తెలియజేయడం, సమస్యలపై పోరాటం చేసేందుకు 'సేఫ్' (స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ' అనే సంస్థను 2022లో స్థాపించారు. దీనిద్వారా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.

సంతాపాల వెల్లువ

జ్యోత్స్న మరణం తీరని లోటని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ సంతాపం ప్రకటించారు. విద్యార్థి, మహిళా ఉద్యమాల్లో చురుకుగా పనిచేసిన జ్యోత్స్న మరణం తీరని ఆవేదన కలిగించిందని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవిలు పేర్కొన్నారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

జ్యోత్స్న మృతి వార్త తెలియగానే సీపీఎం, సీపీఐ, తెదేపా, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, న్యాయవాదులు, ఐద్వా, మహిళా సంఘాలు, బాలోత్సవ్ కమిటీ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. సీతారాంపురంలోని వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జ్యోత్స్న పార్థివదేహాన్ని బుధవారం విమానంలో విజయవాడకు తీసుకురానున్నారు.

'వరదల్లోనూ వైకాపా బురద రాజకీయం దారుణం'

ఆటోనగర్, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా వరదలు వచ్చినప్పుడు ఒక్క రూపాయి నష్టపరిహారం కూడా అందజేయలేదని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, వసంత కృష్ణప్రసాద్‌లు విమర్శించారు. మంగళవారం ఆటోనగర్ తెదేపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వరద పరిహారంపై వైకాపా నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఇటీవల కృష్ణా, బుడమేరు వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు 15 రోజుల్లోనే నష్టపరిహారం అందించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌లా ఉత్తుత్తి బటన్ నొక్కలేదని, వరద బాధితుల ఖాతాలకు నష్ట పరిహారం నేరుగా జమ అయ్యేలా సీఎం చంద్రబాబు కృషి చేశారన్నారు. బుడమేరు వరదలకు గత వైకాపా ప్రభుత్వమమే కారణమన్నారు. కృష్ణా నదికి 8 సార్లు వరద వచ్చిందని, ఆ రోజు సీఎంగా ఉన్న జగన్‌రెడ్డి ఒక్కసారి కూడా వచ్చి పరామర్శించలేదని, ఏ వ్యక్తికి డబ్బులివ్వలేదని మండిపడ్డారు. జగన్ పాలనలో గోదావరి వరదలు వస్తే కుళ్లిపోయిన 3 టమోటాలు, 2 బంగాళాదుంపలిచ్చి బాధితులను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రజలు నిలదీస్తే కొన్ని చోట్ల కొంతమమందికి మాత్రమే రూ.1000 ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు.

ఆలపాటికి అపూర్వ విజయాన్ని అందజేద్దాం

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అఖండ విజయం చేకూరుద్దామని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక లలిత కన్వెన్షన్‌హాల్‌లో మంగళవారం కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాజకీయంగా, పాలనాపరంగా ఎంతో అనుభవం ఉన్న రాజేంద్రప్రసాద్ లాంటి వ్యక్తుల అవసరం శాసనమండలికి ఉందన్నారు. ఎన్నికల ముందు పొత్తులో భాగంగా ఆలపాటి సొంత నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా పోటీ చేయలేకపోయిన విషయాన్ని గుర్తుచేస్తూ, అందుకు ప్రతిగా అపూర్వ విజయం కోసం అందరూ బాధ్యత వహించాలన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు మాట్లాడుతూ ఆలపాటిని గెలిపించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కంచుకోట లాంటి నియోజకవర్గం నుంచి కూటమి ధర్మంలో భాగంగా పోటీ చేయకుండా ఆలపాటి తన సీటును త్యాగం చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవడంతో పాటు విధిగా ఆలపాటికి ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ శాసనమండలిలో ప్రస్తుతం కూటమి అభ్యర్థుల బలం పెరగాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో కూటమి అభ్యర్థిగా ఆలపాటిని అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిపారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అరాచక, అవినీతి పాలనతో యావత్ రాష్ట్ర ప్రజలను వైకాపా ప్రభుత్వం అంతులేని మానసిక వ్యధకు గురిచేసిందన్నారు. పట్టభద్రులు, నిరుద్యోగ యువతకు మెగా జ్యాబ్ క్యాలెండర్ అంటూ ఆర్భాటపు ప్రచారంతో అధికారం దక్కించుకున్న వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలన మొత్తం జ్యాబ్‌లెస్ క్యాలెండర్‌నే చూపించిందన్నారు. పట్టభద్రులందరికీ న్యాయం చేయాలన్నదే కూటమి ప్రభుత్వ అభిమతమన్నారు. ప్రశ్నించే గొంతుకు సమాధానం చెప్పే విజ్ఞత చంద్రబాబుకే ఉందన్నారు. ఉమ్మడి, విభజిత రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కేవలం తెదేపా ప్రభుత్వ హయాంలోనే అన్న విషయం బహిరంగ రహస్యమే అన్నారు. విజ్ఞతతో ఆలోచించి తనకు ఓటు వేసి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. కూటమి నాయకులు కొనకళ్ల జగన్నాథరావు, గొర్రెపాటి గోపీచంద్, బండి రామకృష్ణ, కాగిత వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, వేదికపై వేదవ్యాస్, అశోక్‌బాబు, ఆలపాటి, కొనకళ్ల తదితరులు



శ్రీ గజలక్ష్మీదేవి

ప్రత్యేక అలంకారంలో కొండలమ్మ



బాపులపాడు : కొత్తపల్లిలో అమ్మవారికి రూ.25 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ

గజలక్ష్మీ పాహిమాం..

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా వేమవరం కొండలమ్మ దేవస్థానంలో మంగళవారం అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సహస్రనామ కుంకుమార్చన, శ్రీసూక్త లక్ష్మి, మన్యుసూక్త హవనం, అపమృత్యు దోష పరిహారానికి లక్ష్మీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం తరకటూరు, కాలేఖాన్‌పేట వారిచే భజనలు, సాయంత్రం ఊంజల్‌సేవ, పంచహారతులు, రాత్రికి విజయవాడ మాధురి ఆర్కెస్ట్రాచే భక్తిసంగీత విభావరి, మచిలీపట్నం రంగస్థల కళాకారులతో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. బుధవారం మూలా నక్షత్రం పురస్కరించుకొని విద్యార్థులచే సామూహిక సరస్వతీదేవి పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

మార్చి నాటికి తూర్పు బైపాస్ పనులు ప్రారంభిస్తాం

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: నూతనంగా నిర్మించబోయే నాలుగు వరుసల తూర్పు బైపాస్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు వచ్చే మార్చి నాటికి ప్రారంభిస్తామని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బైపాస్ రహదారి సమగ్ర ప్రాజెక్టు నివేదిక పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విజయవాడలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని తూర్పు బైపాస్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి రూపకల్పన చేశారన్నారు. జిల్లాలో ఎన్‌హెచ్ 16 వద్ద ఉంగుటూరు మండలం పొట్టిపాడు నుంచి ప్రారంభించి గుంటూరు జిల్లా కాజ వరకూ 44 కి.మీ. మేర నిర్మించాల్సి ఉందన్నారు. జిల్లా పరిధిలో 26 కి.మీ, గుంటూరు పరిధిలో 18 కి.మీ ఉండే రహదారి నిర్మాణానికి 2024-25 వార్షిక ప్రణాళికలో 2,716 కోట్లు కేటాయించారన్నారు. మార్చి నాటికి భూసేకరణ పూర్తి చేసి పనులు చేపట్టేలా చర్యలు ఉంటాయన్నారు. ప్రాజెక్టు కన్సల్టెంట్ మురళి మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి మూడు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, అందులో రెండో ప్రతిపాదన అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఈ ప్రతిపాదనతో రహదారి నిర్మాణం వల్ల విమానాశ్రయానికి ఎటువంటి ఇబ్బంది ఉండదని, బందరు ఓడరేవుకు దగ్గరగా అనుసంధానం అవుతుందని తెలిపారు. అలైన్‌మెంట్ దారిలో వచ్చే భూముల విలువ తక్కువగానే ఉందని వివరించారు. మొత్తం మీద 8 పెద్ద వంతెనలు నిర్మించాల్సి ఉందని, కృష్ణానదిని దాటేందుకు 3.35 కి.మీ మేర పెద్ద వంతెన అవసరం ఉందన్నారు. రహదారి మార్గంలో అటవీ భూములు, సెల్‌టవర్లు, శ్మశానవాటికలు, కుంటలు తదితరాలు లేవన్నారు. మొత్తం 291 ఎకరాలు భూసేకరణ ద్వారా తీసుకోవాలన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైతే కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు ఆమోదం కోసం ప్రతిపాదనలు సమర్పించనున్నట్టు తెలిపారు. తాత్కాలిక అంచనాల ప్రకారం భూసేకరణతో కలుపుకుని రహదారి నిర్మాణానికి రూ.4,596.29 కోట్లు ఖర్చవుతుందన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



సమీక్షలో కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పల్లెపండగ విజయవంతం చేయండి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో పల్లెపండగ, పంచాయతీ వారోత్సవ కార్యక్రమాల విజయవంతానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంపై మంగళవారం అమరావతి నుంచి నిర్వహించిన వీసీకి కలెక్టర్, ఇతర అధికారులు హాజరై జిల్లాలో పరిస్థితులను వివరించారు. వీసీ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఉపాధిహామీ ద్వారా జిల్లాలో రూ.168 కోట్ల అంచనా వ్యయంతో 2,331 పనులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ గ్రామాల్లో నిర్వహించే పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. చేపట్టిన అన్ని పనులు వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జడ్పీ సీఈవో కె.నాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, పీఆర్ ఎస్ఈ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

15 మంది సభ్యుల గంజాయి ముఠా అరెస్టు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న 15 మందిని పెదపారుపూడిలో అరెస్టు చేశామని ఎస్పీ గంగాధరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెదపారుపూడి హిందూ శ్మశానవాటిక వద్ద కొంత మంది గంజాయి పీలుస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్.ఐ. ప్రవీణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో వెళ్లి 15 మంది నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 8 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, ఆరు చరవాణులు స్వాధీనం చేసుకున్నారన్నారు. మరొకరు రెండు కిలోల గంజాయితో పరారవ్వగా అతని కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయన్నారు. నిందితులందరూ గుడివాడ, ఏలూరు, భీమవరం ప్రాంతాలకు చెందిన వారుగా గుర్తించామన్నారు. వారిని విచారించగా అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరుకు వెళ్లి 10 కిలోల గంజాయి కొనుగోలు చేసి తెచ్చినట్లు అంగీకరించారన్నారు. నిందితుల్లో కొంతమంది పాత నేరస్థులున్నట్లు తెలిపారు. గుడివాడ చెంచుపేట కాలనీకి చెందిన కుంచం ఆశీర్వాదం ఓ కేసులో బందరు జైలులో ఉన్నపుడు ఏలూరుకు చెందిన ఏసీ మెకానిక్ శక్తి జశ్వంత్, కొల్లూరి శ్రీనివాస్, భీమవరానికి చెందిన ఫణీంద్రతో పరిచయం ఏర్పడింది. విలాసాలు, చెడు వ్యసనాలకు బానిసలైన వారంతా కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నట్లు తేలిందని ఎస్పీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. పామర్రు సీఐ శుభాకర్, ఎస్.ఐ. ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గంగాధరరావు, సీఐ శుభాకర్

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాలపై జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం కలెక్టర్లతో నిర్వహించిన సమావేశానికి బాలాజీ హాజరయ్యారు. మంత్రి వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలోకి కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉందని, మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో నియమించనున్నట్టు తెలిపారన్నారు. వీసీకి డీఆర్వో చంద్రశేఖర్, ఇరిగేషన్‌శాఖ ఈఈలు కృష్ణారావు, బాబు, ఆర్డీవోలు స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, షారోన్‌లు హాజరయ్యారు.

చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పురపాలకశాఖ ప్రాంతీయ సంచాలకులు సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. మంగళవారం ఆయన మచిలీపట్నం నగరపాలకసంస్థ కార్యాలయంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల మున్సిపల్ కమిషనర్లు, ప్రజారోగ్యవిభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో తడి, పొడి చెత్త విభజన చేయాలన్నారు. తడిచెత్తను ఎరువుగా, పొడిచెత్తను రీసైక్లింగ్ చేసేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలన్నారు. ప్రభుత్వం పట్టణాల్లో చెత్త సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటోందని, దానికి అనుగుణంగా అధికారులు కృషి చేయాలన్నారు. రెండు జిల్లాల పరిధిలోని డంపింగ్‌యార్డులు, అక్కడ ఉన్న చెత్త నిల్వలపై ఆరా తీశారు. రోజూ వచ్చే చెత్త ఎంత, అందులో తడిచెత్త ఎంత, పొడి చెత్త ఎంత ఉంటుందని వివరాలు తెలుసుకున్నారు. రోజువారీ వచ్చే చెత్తలో ఎంత జిందాల్ ప్లాంట్‌కు తరలిస్తున్నారని ప్రశ్నించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెత్తను బయోమైనింగ్ చేసేందుకు నిధులు కేటాయిస్తున్నందున..వాటిని వినియోగించుకోవాలన్నారు. ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపై ప్రశ్నించి..ఇంకా ఎక్కడైనా పెండింగ్ ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మచిలీపట్నం నగరపాలకసంస్థ కమిషనర్ బాపిరాజుతోపాటు వివిధ పట్టణాల కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

123 దుకాణాలకు 1052 దరఖాస్తులు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: మచిలీపట్నంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ బాలాజీ ఆకస్మికంగా సందర్శించారు. మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. లాటరీ నిర్వహణకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. లాటరీ ప్రక్రియ నిర్వహించే ప్రదేశం, సమయం తదితర వివరాలను దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ ద్వారా తెలపాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన ఎక్సైజ్ ఈఎస్ గంగాధరరావు, ఏఈఎస్ భార్గవ్‌లు మంగళవారం సాయంత్రానికి జిల్లాలోని 123 దుకాణాలకు 1,052 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

చెక్కు బౌన్స్ కేసులో ఏడాది జైలు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: అప్పు తీసుకున్న మొత్తానికి చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష, రూ.10.20 లక్షలు చెల్లించే విధంగా ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి మంగళవారం తీర్పు చెప్పారు. ఉయ్యూరు నగర పంచాయతీ ఎగినిపాడుకు చెందిన పి.పూర్ణచంద్రరావు.. తాడంకి గ్రామానికి చెందిన బి.వీరవెంకట రామమోహనరావు వద్ద 2017లో రూ.7 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకు 2020లో రూ.7.50 లక్షలకు బ్యాంకు చెక్కు ఇచ్చారు. కానీ అది చెల్లని కారణంగా రామమోహనరావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం చెల్లని చెక్కు ఇచ్చిన పూర్ణచంద్రరావుకు పైవిధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. రామమోహనరావు తరపున కేసును న్యాయవాది ఎం.అంకా శ్రీనివాసరావు వాదించారు.

రొయ్యలసాగుతో తాగునీటికి ఇబ్బందులు

కొర్లపాడు(బంటుమిల్లి), న్యూస్‌టుడే: వ్యవసాయ భూముల వెంట రొయ్యల సాగు చేయడంతో పంట పొలాలు చౌడు బారిపోవడంతోపాటు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నామని కొర్లపాడు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం గ్రామంలోని రొయ్యల చెరువుల వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. బోర్లు వేసి ఉప్పునీటితో రొయ్యల సాగు చేయడం వలన గ్రామంలోని మంచి నీటి బావులు కూడా ఉప్పగా తయారయ్యాయని, దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రొయ్యల చెరువుల నుంచి వదిలిన వ్యర్థపు నీరు గ్రామంలోని చెరువులోకి చేరి..అవి ఉప్పగా తయారవుతున్నాయని, దీంతో అవి పశువులు తాగడానికి కూడా పనికి రావడం లేదని పేర్కొన్నారు. పలుమార్లు ఉన్నతాధికారులు, చెరువుల యజమానుల దృష్టికి తీసుకువెళ్లినా తమ గోడు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో రొయ్యల సాగు నిలిపేసి తమ గ్రామంలోని భూగర్భ జలాలు కలుషితం కాకుండా రక్షించాలని కోరారు.



కొర్లపాడులో మహిళల నిరసన

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

టెట్ పరీక్షలకు 90.31 శాతం హాజరు

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ కేంద్రాల్లో టెట్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని డీఈవో తాహెరాసుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం పూట 3 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1336 మందికిగాను, 1191 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 కేంద్రాల్లో పరీక్షలు జరగగా 1337 మందికిగాను 1223 మంది హాజరయ్యారని వెల్లడించారు. రెండు సెషన్స్ కలిపి మొత్తం 90.31 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిదే విజయం

పెడన, న్యూస్‌టుడే: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా ప్రతిపాదించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయమే లక్ష్యంగా శ్రమించాలని ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. పట్టభద్రులను ఓటర్లుగా చేర్పే ప్రక్రియ నిమిత్తం కూటమి శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు మంగళవారం ఆలపాటి పెడనలో పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక తోట మూలలోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి కొనకళ్ల హాజరై ప్రసంగించారు. నవంబర్ 6 వరకు ఓటర్లుగా చేరేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో పట్టభద్రులను చైతన్య పర్చాలని, కళాశాలల నుంచి జాబితా తీసుకుని ఆధారం ముందుకు సాగాలని సూచించారు. 2021 అక్టోబరు నాటికి డిగ్రీ పూర్తిచేసిన వారికి ఓటర్లుగా చేరేందుకు అర్హత ఉంటుందని ఎమ్మెల్యే కాగిత



ప్రసంగిస్తున్న రాజేంద్రప్రసాద్, పక్కన వేదవ్యాస్, కృష్ణప్రసాద్, కొనకళ్ల, అశోక్‌బాబు తదితరులు

కృష్ణప్రసాద్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయ స్ఫూర్తితో మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికలకు సమాయత్తం కావాలని ప్రతిపాదిత అభ్యర్థి ఆలపాటి పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్, జనసేన ఇన్‌ఛార్జ్ పంచకర్ల సురేష్, భాజపా ఇన్‌ఛార్జ్ పుప్పాల రామాంజనేయులు, మాజీ వైస్‌ఛైర్మన్ అబ్దుల్ ఖయ్యూం హుస్సేన్, యక్కల శ్యామలయ్య, కాసగాని శ్రీనివాసరావు, కట్టా సతీష్, బూసపల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: వడ్లమన్నాడు-చెన్నూరు రహదారి కమలాపురం వద్ద కుంగింది. ఇది ప్రమాదకరంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రహదారికి కుడి, ఎడమ వైపుల కోతకు గురై బీటలు వారింది. దీంతో ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపారు. 8 అడుగుల ఎత్తు రిటైనింగ్ గోడ, ఎడమవైపు 50 మీటర్లు, కుడివైపు 80 మీటర్ల పొడవున మరమ్మతులు చేయాల్సి ఉందని గుర్తించారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.10 లక్షల తక్షణ అవసరం ఉందని ఆర్ అండ్ బీ జేఈ కిశోర్ తెలిపారు. పూర్తి స్థాయి మరమ్మతులకు రూ.1.50 కోట్ల వ్యయం అవుతుందని పేర్కొన్నారు. తాత్కాలిక మరమ్మతులలో భాగంగా ఇసుక బస్తాలు వేసి బాదులు అడ్డంగా వేస్తామని ఆయన తెలిపారు.

సినిమాలు
రేవతి: సత్యం సుందరం
మినీరేవతి: రామ్‌నగర్ బన్నీ
సిరివెంకట్: దేవర **రామరాజు:** స్వాగ్

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి

గూడూరు, న్యూస్‌టుడే: రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. మంగళవారం గూడూరులో ఎలుకల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుత ఎలుకల మందు లేకుండా నూకలు, నూనె తదితర పదార్థాలను బొరియల వద్ద ఉంచి, రెండో రోజు మందు కలిపి ఎరను బొరియల వద్ద ఉంచడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. చనిపోయిన ఎలుకలను బయట ఉంచకుండా తగలబెట్టాలని సూచించారు. మందు కలిపే విధానాన్ని చేసి చూపించారు. ఎలుకల నివారణ మందును ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందున వినియోగించుకోవాలన్నారు.

ఊరికి నీరు.. ఇంటింటికీ కుళాయి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

- వైకాపా హయాంలో ఆగిన జలజీవన్ మిషన్ పనులు
- వేగవంతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ మంజూరు చేయడంతోపాటు వారికి నిరంతరంగా అనువుగానూ నీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని సక్రమంగా వినియోగించుకోకపోవడం వల్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేయాల్సిన పనులను వేగవంతం చేయడంతోపాటు మళ్లీ కుళాయి కనెక్షన్లు అవసరమైన కుటుంబాలను గుర్తించడంతోపాటు అవసరమైన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



గూడూరు మండలం కప్పలదొడ్డిలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకు



పెడన మండలం చేవెంద్రపాలెంలో పైపులైన్ లేని కారణంగా పాడైపోయిన పబ్లిక్ కుళాయి

పనులు సాగక.. నీరు అందక

జలజీవన్‌మిషన్ పనుల్లో అలసత్వం కారణంగా బందరు, పెడన నియోజకవర్గాల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురించింది. ఈ పథకంలో భాగంగా రెండు విడతలుగా నిధులు కేటాయించారు. వైకాపా పాలనలో పనులు చేపట్టలేకపోయారు. బందరు మండలం తీర ప్రాంతం కావడంతో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.225 కోట్లు కేటాయించారు. పనులు చేపట్టలేదు. పెడన నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో కూడా కోట్లాది రూపాయలు కేటాయించినా సకాలంలో నిధులు విడుదల కాక, గుత్తేదారులు ముందుకు రాక పనులు ఆగిపోయాయి. బందరు, పెడన పట్టణాలతో కలిపి మొత్తం 99 పథకాలు ఉన్నాయి. తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ సమస్యలను కూడా జలజీవన్ పథకంలోనే పరిష్కరించేలా అధికారులు కార్యాచరణ చేపట్టారు. పనులు చేపట్టకపోవడంతో చాలా చోట్ల పథకాలు అలంకారంగా మారుతున్నాయి. కృత్తివెన్ను మండలం పల్లెపాలెం గ్రామానికి వేసిన పైపులైన్ పాడైపోగా ఇప్పటివరకు మరమ్మతులు కానీ, కొత్త పైపులైన్ ఏర్పాటు గానీ చేయలేదు. పెడన మండలం చేవెంద్రపాలెం గ్రామానికి వెళ్లే పైపులైన్ దెబ్బతిని ఏళ్లు గడిచిపోతోంది. అప్పటి నుంచి ఆగ్రామానికి తాగునీరు అందడం లేదు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో కూడా అనేక గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందడం లేదు. ఇళ్లకు కుళాయి కనెక్షన్ల మాటేమో గానీ.. ఉన్న పబ్లిక్ కుళాయిలు కూడా పాడైపోతున్నాయి.

మండలం	పంచాయతీలు	చేయాల్సిన పనులు	కేటాయించిన మొత్తం (రూ. కోట్లలో)
బందరు	34	212	225.55
పెడన	24	74	22.04
గూడూరు	27	69	14.03
బంటుమిల్లి	21	78	26.02
కృత్తివెన్ను	16	58	22.06

కుళాయిల అవసరంపై సర్వే

గతంలో చేపట్టిన పనులు పూర్తి చేయడంతోపాటు ఇంకా అవసరమైన వనరుల కల్పనకు కూటమి ప్రభుత్వం ఆదేశాలతో మళ్లీ గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ప్రతిపాదనలు చేసింది. దీనిలో భాగంగా గతంలో కుళాయి కనెక్షన్ లేని కుటుంబాలను గుర్తించి ఐదేళ్లు కావడంతో..తాజాగా మండలాల వారీగా సర్వే నిర్వహించారు. ఇప్పటికీ తాగునీరు అందని శివారుగ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలకు పైపులైన్ల విస్తరణ, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, ఇతర వనరులు సమకూర్చేలా చర్యలు తీసుకుంటున్నారు. కుళాయిలు ఇవ్వడంతోపాటు వారికి అవసరమైన నీటిని కూడా అందించాలని ఆదేశించారు. ఆదిశగా అధికారులు అవసరమైన ప్రతిపాదనలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఆయా గ్రామాల్లో ఒక్కొక్కరికి 40 లీటర్ల నీటి చొప్పున మాత్రమే అందిస్తున్నారు. ఇకపై తలసరి 55 లీటర్ల రక్షిత మంచినీటిని అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇంకా ఎక్కడెక్కడ చెరువులు అవసరం ఉంది, ఎన్ని చోట్ల ట్యాంకులు నిర్మించాలి... పైపులైన్ విస్తరణ ఎక్కడ చేయాలి..వాటికి ఎంత నిధులు అవసరం అవుతాయి. ఇలా అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి నివేదించారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

పనులు గుర్తించాలి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో జయరామ్ సూచించారు. పల్లె పండగ కార్యక్రమం సందర్భంగా చేపట్టాల్సిన పనుల గురించి స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. చెరువుల రివిట్‌మెంట్లు, ర్యాంపులు, పైపులైన్లు, శ్మశానషెడ్లు, మంచినీటి పథకానికి సంబంధించిన పనులు చేపట్టడానికి అవకాశం ఉందన్నారు. ఈనెల 21 లోపు పనుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ ధర్మయ్య, ఉపాధి హామీ ఏపీవో వజీర్, ఏవో శిరీషా పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోండి

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు విఘాతం కలిగితే కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ హెచ్చరించారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో శక్తిపటాల నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో దసరా ఉత్సవాలు, ఊరేగింపులు జరుపుకోవాలన్నారు. డీజే, బాణసంచా వంటి వాటికి అనుమతులు లేవన్నారు. నేర స్వభావం ఉన్న వారిని ఎవరినీ ఊరేగింపులకు అనుమతించరాదన్నారు. సమావేశంలో సీఐలు షేక్ అబ్దుల్ నబీ, కె.ఏసు బాబు, ఎస్.పరమేశ్వర్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

చిట్టిపాలెం(మచిలీపట్నంరూరల్) : పర్యావరణ పరిరక్షణకు లయన్స్‌క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రతి ఇంటికి ఒక చెట్టు-ఊరంతా వనం పథకంలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ, ప్రగతి లయన్స్‌క్లబ్ ఆఫ్ మచిలీపట్నం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చిట్టిపాలెం సచివాలయంలో మంత్రి రవీంద్ర గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను పెంచితే పర్యావరణం మెరగవుతుందన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి మాట్లాడారు. అనంతరం గ్రామస్థులు 50 మందికి రగ్గులు, చీరలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో లయన్ ముత్యాలరావు, సిహెచ్.శ్రీనివాసరెడ్డి, ఉప్రదష్ట రాంబాబు, జి.రామబ్రహ్మం, పి.సత్యనారాయణరావు, రామధేని వేణుబాబు, నల్లారి శేషగిరిరావు, జి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

దాతల తోడ్పాటు ప్రశంసనీయం

మచిలీపట్నంకార్పొరేషన్ : దాతల తోడ్పాటు ప్రశంసనీయమని మచిలీపట్నంప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా.సుందరాచారి అన్నారు. వైద్యకళాశాలకు మచిలీపట్నంకు చెందిన మన్నెం గుడేర రూ.60వేల విలువైన క్రీడా పరికరాలు వితరణగా అందించారు. గుడేర తనయుడు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విద్యుత్‌శాఖ నోడల్ అధికారి మన్నెం భాస్కరరావును ప్రిన్సిపల్‌తోపాటు కళాశాల అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ స్వర్ణలత, వ్యాయామోపాధ్యాయుడు నాగరాజుతో పాటు లక్ష్మణరావు తదితరులు దాతను సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.



దాతతో ఆయన తనయుడు భాస్కరరావు, ప్రిన్సిపల్ తదితరులు

ఓబీసీల అభివృద్ధికి కృషి చేస్తా

పెడన, న్యూస్‌టుడే: ఓబీసీల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన శొంఠి నాగరాజు తెలిపారు. బందరు మండలం పెదకరగ్రహారానికి చెందిన నాగరాజు 2024 సార్వత్రిక ఎన్నికల్లో పెడన నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీచేసి ఓటమి పొందారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? నగరంలోని కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీలో ఖాళీస్థలాల్లో ఆవరించిన పొదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పుడప్పుడు విషసర్పాలు సంచరించడంతో భయపడుతున్నాం. **-స్థానికులు**

✔ స్థలాలను ఖాళీగా వదిలేసిన యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. త్వరలోనే సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తున్నాం.
-బాపిరాజు, నగరపాలకసంస్థ కమిషనర్

–మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రత్యేక పూజలు... అభిషేకాలు

మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: నగరంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామికి వివిధ రకాలపండ్ల ముక్కలతో భక్తులు అభిషేకాలు జరిపించారు. పరాసుపేట సువర్చలాసమేత ఆంజనేయస్వామి ఆలయం, రైల్వేస్టేషన్ ప్రాంతంలోని నాగాంజనేయస్వామి తదితర ఆలయాల్లో పూజలు జరిగాయి.



పండ్లముక్కల అభిషేక పూజలు అందుకున్న ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామి

కార్మికుల తొలగింపు అన్యాయం


మచిలీపట్నం(గొడుగుపేట),న్యూస్‌టుడే: సామ్‌సంగ్ కంపెనీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమిళనాడులోని పెరంబుదూరు సామ్‌సంగ్ పరిశ్రమలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మచిలీపట్నంలోని సామ్‌సంగ్ షోరూమ్ ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సంఘ జిల్లా నాయకులు టి.చంద్రపాల్ మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల్లో 1800 మందిని తొలగించడం అన్యాయమన్నారు. నాయకులు బూర సుబ్రహ్మణ్యం, కేవీ గోపాలరావు, చిరువోలు జయరావు, ఎండి యూనస్, ఆనంద్‌బెనర్జీ, పి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: తాడిగడపలోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్‌లో మంగళవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-19 బాలబాలికల రైఫిల్ షూటింగ్ జట్ల ఎంపిక పోటీల్లో పలు ప్రాంతాల నుంచి సుమారు 35 మంది షూటర్లు తలపడ్డారు. అకాడమీ చీఫ్ కోచ్ సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన పోటీలో బాలబాలికలకు ఎయిర్ రైఫిల్ పీప్ సైట్, ఎయిర్ రైఫిల్ ఓపెన్ సైట్, ఎయిర్ పిస్టల్ విభాగాల్లో పోటీ పడ్డారని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. ఎంపిక పోటీలో ప్రతిభగల షూటర్లను జిల్లా జట్టుకు ఎంపికచేసి తుది జట్టును త్వరలో ప్రకటిస్తామని ఆమె చెప్పారు.

స్వామివారి ఆదాయం రూ.8.04 లక్షలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం మంగళవారం భక్త జనసందోహంతో నిండిపోయింది. విద్యార్థులకు సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ఒక్క రోజే రూ.8.04 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాద్ తెలిపారు.



మచిలీపట్నం: సంతానలక్ష్మిగా దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరి



మహాలక్ష్మీదేవిగా పార్వతిఅమ్మవారు



గీతామందిరంలో..



బలరామునిపేట విశ్వేశ్వరాలయంలో..



దత్తాశ్రమంలో..



రేవతి సెంటరులో గంగానమ్మ



బందరుకోట కోదండ రామాలయంలో..

మహాలక్ష్మి నమోస్తుతే


న్యూస్‌టుడే బృందం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఆరోరోజైన మంగళవారం లోకపావని మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించేందుకు భక్తులు ఆలయాలకు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులు జరిపారు.



లక్ష్మీపురం లాకుల వద్ద తెప్పోత్సవం



పెడన: అమ్మవారి ఊరేగింపు



కోనలో..



ఎస్.ఎన్.గొల్లపాలెంలో ధాన్యలక్ష్మిగా..



మంగినపూడిలో కాత్యాయనీదేవిగా...



గూడూరులో..



గూడూరు గాంధీబొమ్మ కూడలిలో ధనలక్ష్మిగా



పెడన: కొంకేపూడిలో అమ్మవారికి పూజలు



పెడన: మహాలక్ష్మీదేవి అలంకరణలో..



బంటుమిల్లి : పెదతుమ్మిడి రామాలయంలో..



బంటుమిల్లి : వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మిగా..



బంటుమిల్లి రామాలయంలో..

ఉద్యోగాలకు 58 మంది ఎంపిక

పామర్రు గ్రామీణం: గత వైకాపా ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేకుండా చేసి వారి జీవితాలను నాశనం చేసిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మంగళవారం పామర్రు మండలం కురుమద్దాలిలో ఏపీఎస్‌ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కల్పనశాఖ, డీఆర్‌డీఏ- డీడాప్ సంయుక్తాధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్, సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్సు, డి.మార్ట్, ఇన్నోవ్ సోర్స్, నవతా ట్రాన్స్‌పోర్టు కంపెనీల ప్రతినిధులు పదో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్హతలతో హాజరైన 208 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి 58 మందిని ఎంపికచేశారు.

రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో ఈ నెల 10 నుంచి మూడు రోజులు జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను మంగళవారం నూజివీడులోని డీఏఆర్ కళాశాల మైదానంలో ఎంపిక చేశామని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జీఎస్‌సీ బోస్ తెలిపారు. ఎంపిక పోటీల నుంచి ప్రతిభగల క్రీడాకారులను ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లకు ఎంపిక చేశామని పేర్కొన్నారు.



ఎంపికైన ఉమ్మడి కృష్ణా బాలబాలికల జట్లతో ఎంపిక కమిటీ సభ్యులు, సంఘం ప్రతినిధులు

బాలుర జట్టు: కె.జగదీష్, ఎ.మనోభిరామ్, ఆర్.గౌతమ్, జి.రాకేష్ వీరమాధవ్, వి.కీర్తన్ సాయి, కె.ఆకాష్ సాయి, బి.సాయి రోహిత్, వి.తేజ వెంకట స్వరాజ్, కె.మున్నా, టి.ఈశ్వర్ సాయి, ఎస్‌కే రిహాన్, ఎ.ప్రణవ్ రామ్, స్టాండ్ బైస్‌గా కె.డానియేల్ నాష్, కె.యశ్వంత్, ఎం.జశ్వంత్, ఎ.మణికంఠ.

బాలికల జట్టు: బి.కుసుమ, ఆర్.వాహిని, బి.వర్షిణి, ఎం.కావ్యశ్రీ, ఎ.మైథిలి, టి.నాగసుధ, డి.గెనెస్సా, డి.ఇందుప్రియ, జి.జెస్సీ, పి.కామాలిక వెంకట అపర్ణ, ఆర్.మేధిని, ఎన్.సాయి దుర్గాప్రశాంతి, స్టాండ్ బైస్‌గా ఎస్.నాగరాణి, బి.మహేశ్వరి, డి.పౌమని, పి.విష్ణుప్రియ.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గుడివాడ రోడ్డులోని షాదీఖానాలో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించారు. 25 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించి ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహించనున్నారు. 60 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వీరికి త్వరలో అందజేయనున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ ఉస్మాన్‌బాషా, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు పాషి, కోన వెంకటేశ్వరమ్మ, తాతా సాయిరాం పాల్గొన్నారు. ఆశ్రం నుంచి వచ్చిన వైద్య బృందం ఈ పరీక్షలను నిర్వహించింది.

ఆర్థిక సాయం

మల్లవోలు(గూడూరు), న్యూస్‌టుడే : ముదిరాజుపాలెం గ్రామానికి చెందిన బండారు రాఘవులు మృతిచెందగా మల్లవోలు హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు దహనసంస్కార ఖర్చుల నిమిత్తం మంగళవారం రూ.5 వేలు సాయంగా అందించారు. సంస్థ ప్రతినిధులు ప్రత్తిపాటి శ్రీనివాసరావు, ప్రత్తిపాటి నరసింహ, నాంచారయ్య పాల్గొన్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

దత్తపీఠంలో వైభవంగా దసరా వేడుకలు



శ్రీమహాలక్ష్మి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



పూజలో భక్తులు

పటమట, న్యూస్‌టుడే: పటమట దత్త పీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో 6వ రోజు అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సుదర్శన సహిత నారాయణాక్షరి హోమం, 1008 కలువ పూలతో హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి బంగారు పుష్పాలతో అర్చన చేసి పల్లకీలో ఊరేగించారు. బుధవారం మూల నక్షత్రం కావడంతో ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు, అనంతరం వారికి పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కూటమితోనే పట్టభద్రుల సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే కూటమితోనే పట్టభద్రుల సంక్షేమం, యువతకు ఉపాధి సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గన్నవరంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు.. ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తెదేపా సీనియర్ నేత, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని, ఏ ఒక్క రంగం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. ఉభయ కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకొని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం పలువురు పట్టభద్రులతో ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు వద్రాణం హరిబాబు, మూల్పూరి సాయికల్యాణి, చలమలశెట్టి రమేష్‌బాబు, కురమద్దాలి ఫణికుమార్, జాస్తి వెంకటేశ్వరరావు, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, గొడ్డళ్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై స్పందన



వీసీకి హాజరైన ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన గ్రామీణ పరిపాలనాభివృద్ధి అంశాలపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ సమావేశం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆయన గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి సమస్యలపై శ్రద్ధ చూపాలని, వీటిపై ప్రయోగాత్మకంగా వెంటనే పరిష్కారమయ్యే సమస్యలను ప్రతిపాదించి అమలు చేయాలని సూచించారు. దీంతో పోరంకి, పెదపులిపాక, పెనమలూరు, గోసాల, గంగూరు ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకులు, తాగునీటి పైపు లైన్లు వీధి కుళాయిల తదితర సమస్యలను అధికారులు వెంటనే సిద్ధం చేశారు. దాదాపు రూ. 3 లక్షల వ్యయంతో వీటిని రోజుల వ్యవధిలో పరిష్కరించడానికి అధికారులు నిర్ణయించారు. ఎంపీడీవో బండి ప్రణవి, ఈవోపీఆర్డీ బొమ్మసాని శ్రీనివాసరావు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జూదరుడిపై బైండోవర్ కేసు

యనమలకుదురు(పెనమలూరు), న్యూస్‌టుడే: యనమలకుదురుకు చెందిన ఎం.మురళీకృష్ణ అనే వ్యక్తి పై పెనమలూరు పోలీసులు మంగళవారం బైండోవర్ కేసు నమోదు చేసి పెనమలూరు తహసీల్దార్ గోపాలకృష్ణ ఎదుట హాజరుపర్చారు. ఇతను జూదశిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలుసుకొన్న పోలీసులు అతని పై ఈ చర్య తీసుకొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి: వైవీబీ

ఉయ్యూరు: భూయజమాని నుంచి కొనుగోలు చేసిన తమ స్థలాలను నిషేధిత జాబితా(22ఏ)లో చేర్చడంతో క్రయ విక్రయాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక పట్టణ హనుమాన్‌నగర్ వాసులు మంగళవారం మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే ఆయన కలెక్టర్, తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. కొన్నేళ్ల క్రితమే ఓ రైతు దగ్గర కొనుగోలు చేసుకొని గృహాలు ఏర్పాటు చేసుకున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వీటిని నిషేధిత జాబితాలో చేర్చారని తెలిపారు. ఇప్పటికే హనుమాన్‌నగర్ వాసులు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు ఆర్. ఫణికుమార్, అబ్దుల్లా, వీర్రాజు, శ్రీనివాస్, తేజ, నరసింహారావు, నాగబాబు, శోభనాద్రి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు నేడు

పెనమలూరు, న్యూస్‌టుడే: యనమలకుదురు కనకదుర్గమ్మ వారి దేవాలయంలో బుధవారం సరస్వతిదేవి అలంకరణ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేయనున్నట్లు ఆలయ ఈవో యూవీ ప్రసాదరావు తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వేలేరు విద్యుత్తు ఉప కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు సీపీడీసీఎల్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం

కంకిపాడు గ్రామీణం, : మండలంలోని కోలవెన్నులోని పశు వైద్య కేంద్రంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి నరసింహారావు మంగళవారం తెలిపారు.

వరద బాధితులకు చేయూత

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి ఉంగుటూరుకు చెందిన కోనేరు రత్నకుమారి, బ్రహ్మేశ్వరరావు దంపతులు రూ.20 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు మంగళవారం చెక్కు అందజేశారు.

ఏపీఐఐసీ ఛైర్మన్‌కు అభినందన

కానూరు, న్యూస్‌టుడే: ఏపీఐఐసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మంతెన రామరాజును తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి జి.రామకృష్ణప్రసాద్ మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. తెదేపా ఎన్టీఆర్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు మోటేపల్లి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.


అంకితభావంతో సేవలకు గుర్తింపు

కంకిపాడు: నిత్యం అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో అనూష అన్నారు. బదిలీపై వెళ్తున్న మండల పాలనాధికారి ఉదయభాస్కర్‌ను ఎంపీపీ కార్యాలయంలో సన్మానించారు. ఉదయభాస్కర్ స్థానంలో ఎన్.బసవయ్య బాధ్యతలు చేపట్టారు.

అన్ని రంగాల్లోనూ డ్రోన్ల వినియోగం

గంగూరు(పెనమలూరు): డ్రోన్ల వినియోగం అన్ని రంగాలకు విస్తరిస్తోందని డైట్ ద్రోణాచార్య టెక్ హబ్ చీఫ్ ఇంజినీరు విష్ణు ఎస్ శ్రీకాల అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో గత ఐదు రోజులుగా డైట్ ద్రోణాచార్య టెక్‌హబ్, ధనేకుల ఫ్లై హై స్టూడెంట్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒక వారం డ్రోన్స్ వర్క్‌షాపు మంగళవారంతో ముగిసింది.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న కాకాని బాబు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడులో నిర్మిస్తున్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయానికి మాజీ ఉప సర్పంచి కాకాని బాబు రూ.2 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, వీరమాచనేని నాగయ్యకు నగదు అందజేశారు. ఆలయ నిర్మాణానికి తమ వంతుగా చేయూతనిచ్చినట్లు బాబు తెలిపారు.

మహాలక్ష్మిదేవీ.. మనసాస్మరామి



యనమలకుదురు కనకదుర్గమ్మ ఆలయంలో కరెన్సీ నోట్లతో అలంకరణ



యనమలకుదురు రామలింగేశ్వరాలయంలో కాత్యాయనీమాతగా..



ఉయ్యూరుగ్రామీణం: వీరవల్లి మొఖాసాలో మంగళగౌరిగా..



పోరంకి: శ్రీనివాసనగర్ శిర్డీ ఆలయంలో..



కానూరు: తాడిగడప రామాలయంలో



ఈడుపుగల్లులో మహాలక్ష్మీ దేవి రూపంలో..



మద్దూరులో..



పెనమలూరు: మహిళల కుంకుమ పూజ



కంకిపాడు గ్రామీణం: ఉప్పలూరులో..




ఉయ్యూరుగ్రామీణం: పెద ఓగిరాలలో మహాలక్ష్మీదేవిగా

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో దసరా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాలు, మండపాలు జగన్మాత నామస్మరణతో మారుమ్రోగుతున్నాయి. ఉదయం, సాయంత్రం అభిషేకాలు, హోమాలు, కుంకుమ పూజలు జరుగుతున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో రాత్రి వేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. **- న్యూస్‌టుడే బృందం**



హనుమాన్‌జంక్షన్: శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో..



ఆత్కూరులో..



రామవరప్పాడు: పేరంటాలమ్మ ఆలయంలో..



ప్రసాదంపాడులోని సాయిబాబా ఆలయంలో ..



కంకిపాడు శివాలయంలో..



కంకిపాడు గ్రామీణం: ప్రొద్దుటూరు శివాలయంలో..



ఉయ్యూరు: సోమేశ్వరాలయంలో గాయత్రీ దేవిగా..



హనుమాన్‌జంక్షన్: రంగన్నగూడెంలో..



ఉయ్యూరు: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్



ఉయ్యూరు గ్రామీణం: ముదునూరులో..

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

మారేడుమాక (కంకిపాడు), న్యూస్‌టుడే: స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భాగంగా మంగళవారం మారేడుమాకలో సమావేశం నిర్వహించారు. దీనిలో సామాజిక, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అంశాలపై గ్రామస్థుల నుంచి అర్జీలు తీసుకున్నారు. తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష, వివిధ శాఖల స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవానీలకు అల్పాహారం పంపిణీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బొమ్ములూరు వద్ద పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో భవానీ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతి శిబిరానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువు దీరిన కనకదుర్గమ్మ సన్నిధికి వెళ్తున్న భవానీలకు ఇక్కడ అల్పాహారం, భోజనంతో పాటు, విశ్రాంతి తీసుకునేందుకు బస, ప్రాథమిక వైద్య సేవలు అందించారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. నూజివీడుకు చెందిన బూరుగుపల్లి నాగహనుమాన్ సూర్యతేజ, తేజస్వి దంపతుల ఆధ్వర్యంలో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ శ్రీకనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం గన్నవరం మండలం కేసరపల్లిలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిని ఆనుకొని పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు దుర్గమ్మ భక్తులకు విశ్రాంతి కొరకు టెంట్‌తో పాటు మంచినీరు, మజ్జిగ, అల్పాహారం ఉచితంగా అందివ్వనున్నారు. శిబిరాన్ని సీఐ శివప్రసాద్ ప్రారంభించి భక్తులకు పండ్లు, మజ్జిగ, అల్పాహారాన్ని అందజేశారు.

'ఆర్‌జీఎస్‌ఏ'పై శిక్షణ

కంకిపాడు: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్ఎస్‌జీఏ)పై గ్రామ పంచాయతీల ఉపసర్పంచి, వార్డు సభ్యులకు 9, 10 తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అనూష ప్రకటనలో తెలిపారు.

ఆదాయ వనరులపై దృష్టేది?



శిథిలమైన పాకల్లో కూరగాయల దుకాణాలు

- అందుబాటులో విలువైన స్థలాలు
- పంచాయతీలు పట్టించుకుంటే మేలు

కంకిపాడు, న్యూస్‌టుడే

గ్రామ పంచాయతీల్లో క్రమేణా ఖర్చులు అధికమవుతున్నా దానికి తగ్గట్లు ఆదాయ వనరులు పెరగడం లేదు. దీంతో ప్రతి పనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులపై ఆధారపడాల్సి వస్తోంది. పునాదిపాడు పంచాయతీ అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని స్థిరాదాయాన్ని పెంచుకుంది. అంతకుమించి వనరులున్న కంకిపాడు మాత్రం అభివృద్ధిలో వెనుకబడుతోంది. దీనిపై పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కార్యాచరణ అమలుతో మంచి ఫలితాలు వస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పులి రామారావు కూరగాయల మార్కెట్..

ఇది బస్టాండ్ కూడలికి సమీపంలో కంకిపాడు-గొడవర్రు రోడ్డు పక్కన ఉంది. పంచాయతీకి చెందిన ఈ స్థలంలో 25కి పైగా దుకాణాలు ఉండడంతో అద్దె లభించేది. రైతు బజార్ ఏర్పాటుతో ఇక్కడ కొనుగోళ్లు తగ్గాయి. ప్రస్తుతం నాలుగైదు దుకాణాలను మాత్రమే వినియోగించుకుంటున్నారు. 15ఏళ్ల కిందట రేకులు, తాటాకులతో వీటిని నిర్మించారు. మరమ్మతులు చేయకపోవడంతో చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో పదేళ్ల కిందట ఆర్‌సీసీ దుకాణ సముదాయం నిర్మాణానికి నిధులు కేటాయించారు. వివిధ కారణాలతో పనులు చేపట్టలేదు. ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.50 లక్షల వ్యయంతో 10-12 గదులతో విశాలమైన దుకాణ సముదాయం నిర్మించే అవకాశం ఉంది. కూరగాయల అమ్మకానికే కాకుండా ఇతర వ్యాపారాలకు అద్దెకు ఇవ్వడం ద్వారా నెలకు రూ.1.5 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ధరావత్తు ద్వారా రూ.10-15లక్షలు లభించే అవకాశం ఉంది.

ఆటో రిక్షా స్టాండ్ స్థలంలో..

ఇది సింహాల బొమ్మ కూడలిలో రద్దీగా ఉండే ప్రదేశంలో ఉంది. దీనిలో దుకాణ సముదాయ నిర్మాణానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రస్తుతం నామమాత్రపు ఆదాయం వస్తోంది. ఈ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆదాయం గణనీయంగా వస్తుందని అంచనా వేస్తున్నారు.



ఖాళీగా ఉన్న భాగం

అక్కడ చోరీ.. ఇక్కడ తాకట్టు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: చోరీ చేసిన ద్విచక్ర వాహనాలకు కంకిపాడు తాకట్టు కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే అనధికారంగా సుమారు నాలుగు వాహన తాకట్టు ప్రదేశాలు ఉన్నాయి. వీరంతా చోరీ చేసిన, వాహనాలకు ఎటువంటి కాగితాలు లేనివి అతితక్కువ నగదుకు తాకట్టు పెట్టుకుంటున్నారు. అంతేకాక వీరికి తాకట్టు పెట్టేవారంతా జూదం, కోడి పందేలు, ఆన్‌లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్, వ్యసనాలకు గుర్రైనవారు కావడం గమనార్హం. ఇటీవల ఓవ్యక్తి తన ద్విచక్ర వాహనం పోయిందని కంకిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని వాహనాన్ని సమీప బంధువే ఇక్కడకు తీసుకువెళ్లి తాకట్టు పెట్టాడు. ఈ విషయం తెలిసిన ఆ వ్యక్తి తన వాహనాన్ని తెచ్చేందుకు వెళ్లగా అక్కడ సుమారు 100కు పైగా వాహనాలు కనిపించడంతో అవాక్కయ్యాడు. దీంతో విషయాన్ని పోలీసులకు చెప్పగా స్పందించిన పోలీసులు సంబంధిత వ్యక్తిని విచారించగా తాకట్టు వాహనాల వ్యవహారం కూడా బయటపడింది. దీంతో వాటిని రికవరీకి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇదేవిధంగా కంకిపాడులో పలువురు తక్కువ ధరకు వాహనాలు తాకట్టు పెట్టుకుంటారని తెలిసి ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడకు వాహనాలు తీసుకు వచ్చేవారు ఎక్కువయ్యారు. ఫైనాన్స్ ఇచ్చేవారు తీసుకునే వడ్డీ కూడా రూ.15 నుంచి రూ.20 వరకు ఉంది. అయినా లెక్కలేకుండా పలువురు వాహనాలు తాకట్టు పెట్టడానికి ఇక్కడకు వస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

సీఐ కారును ఢీకొన్న మహిళా ఇంజినీరు కారు

పెనమలూరు, న్యూస్‌టుడే: ఓ మహిళా సీఐ కారును మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీరు తన కారుతో ఢీకొట్టిన ఘటన కానూరు-ఎనికేపాడు రహదారిలో మంగళవారం చోటుచేసుకుంది. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా స్పెషల్ బ్రాంచిలో సీఐగా పనిచేస్తున్న సాహెరాబేగం పెనమలూరు ప్రాంతంలో సీసీ కెమెరాల పనితీరు పరిశీలనకు సోమవారం సాయంత్రం పర్యటించారు. ఈమె కానూరు శ్మశానాల ప్రాంతంలో తన కారును నిలిపి కెమెరాలు పరిశీలించారు. ఈలోగా మితిమీరిన వేగంతో వస్తున్న ఓ కారు ఆగి ఉన్న సాహెరాబేగం కారును ఢీకొట్టారు. దీంతో సీఐ కారు ధ్వంసమైంది. ఈ కారును ఢీకొట్టింది కంకిపాడుకు చెందిన ఉయ్యూరు శ్రీలక్ష్మీప్రతిభగా పోలీసులు గుర్తించారు. ఈమె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కాగా.. తన తండ్రిని గన్నవరంలో నిర్వహిస్తున్న మద్యం టెండర్ల వద్ద దించడానికి హడావుడిగా వెళ్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన శ్రీలక్ష్మీ ప్రతిభపై పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీవులేని లోకంలో నేనెందుకు..!

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి ❖ తట్టుకోలేక భార్య బలవన్మరణం

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్, మధురానగర్), న్యూస్‌టుడే



నాగరాజు, ఉష (పాత చిత్రం)

వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఒకరంటే మరొకరికి పంచప్రాణాలు. పెద్దలను ఒప్పించి పెళ్లిపీటలెక్కారు. కోటి ఆశలతో కొత్త జీవితాన్ని ఆరంభించారు. ఎంతో అన్యోన్యంగా.. ప్రేమానురాగాలతో మెలుగుతున్నారు. జీవితం ఆనందంగా సాగిపోతున్న తరుణంలో రోడ్డు ప్రమాదం భర్తను కబళించింది. భార్య తట్టుకోలేకపోయింది. నీవు లేని ఈ లోకంలో నేను ఎందుకని భావించి.. ఉరేసుకుని బలవన్మరణం పొందిన హృదయవిదారక ఘటన నగరంలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నగర శివారులోని ప్రసాదంపాడుకు చెందిన రాచపూడి నాగరాజు (27) స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో టిఫిన్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. అయోధ్యనగర్‌కు చెందిన చల్లా ఉష (22)ను ప్రేమించారు. వీరిద్దరూ ఏడాది కిందటే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. అయోధ్యనగర్‌లో కాపురం పెట్టారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు భర్త హోటల్‌కు వెళ్లి.. రాత్రి 11 గంటల తర్వాత ఇంటికి వచ్చేవారు. సోమవారం పనికి వెళ్లి, అర్ధ రాత్రి అయినా ఇంటికి రాలేదు. మంగళవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో బి.ఆర్.టి.ఎస్. రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు మృతి చెందినట్లు భార్యకు సమాచారం వచ్చింది. ఉష తన బంధువులతో కలిసి అక్కడికి వెళ్లారు. విగతజీవిగా పడిఉన్న భర్తను చూసేసరికి తట్టుకోలేకపోయారు. గుండెలవిసేలా రోదించారు. గుణదల కుమ్మరిబజారుకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై.. భానునగర్ కూడలి నుంచి పడవలరేవు వైపు రాంగ్ రూట్‌లో అతి వేగంగా వెళుతూ నాగరాజు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టారు. గాయాలతో వారు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద తీవ్రతకు వాహనాల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

మళ్లీ వస్తానని ఇంటికి వెళ్లి..

ఈ ఘటనపై మృతుడి భార్య ఉష.. గుణదల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో.. ఇంటికి వెళ్లొస్తానని ఉష తన తల్లి ఆదిలక్ష్మి చెప్పి వెళ్లారు. కొద్ది సేపటికి తల్లికి అనుమానం వచ్చి కుమార్తె ఇంటికి వెళ్లి చూడగా.. ఉరికి వేలాడుతూ కనిపించింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. భర్త మరణాన్ని తట్టుకోలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదిలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం.. ప్రేమికుల ప్రాణాలను బలిగొంది. రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.

తోపుడు బండి దగ్ధం

పెనమలూరు, న్యూస్‌టుడే: మొక్కజొన్న కండెలు విక్రయించుకొనే మహిళ తోపుడు బండిని కాల్చేసిన సంఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొడాలి వాణి పోరంకిలో తోపుడు బండిపై మొక్కజొన్న కండెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈనెల 3వ తారీఖున ఆమె బంధువైన రాంబాబు అనే వ్యక్తి ఆమె వద్దకు వచ్చి తోపుడు బండిని ఈ ప్రాంతంలో పెట్ట వద్దంటూ వివాదానికి దిగాడు. తన మాట వినకపోతే బండిని కాల్చేస్తానంటూ హెచ్చరించాడు. తర్వాత రోజు ఉదయం వెళ్లి చూడగా బండితో పాటు దానిలో ఉన్న గ్యాస్ సిలిండర్, పొయ్యి, కండెలు, బొగ్గులు కాలిపోయి ఉన్నాయి. దీనిపై ఆమె రాంబాబు పై అనుమానం వ్యక్తం చేస్తూ మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధికి చర్యలు



చల్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లిలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని 50 పడకలతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కస్తూరిబా మెమోరియల్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి నిధులు, సీఎస్ఆర్ నిధులు, దాతల సహకారంతో కృషి చేస్తామన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఏపీఎంఐడీసీ ఈఈ నాగార్జునరావు, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎ.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం నిర్వహించిన సామాజిక వైద్యశాల సలహా కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో వార్డులు సందర్శించి రోగుల అవసరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్టు, ఎంఎస్ సర్జన్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఎక్స్‌రే తీయకుండా మచిలీపట్నానికి రిఫర్ చేస్తున్నారని కమిటీ సభ్యులు కొల్లూరి వెంకటేశ్వరరావు సమావేశం దృష్టికి తీసుకురాగా, ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచించారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ జయకుమార్, ఎంపీడీవో మరియాదేవి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు విచక్షణతో ఓటేయాలి



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టభద్రులు విచక్షణతో ఆలోచించి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేలా తెదేపా నాయకులు, కార్యకర్తలు అవగాహన కల్పించాలని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో తెదేపా కార్యకర్తలు, నాయకులతో మంగళవారం రాత్రి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అయిదేళ్లలో వైకాపా నాయకులు అరాచకాలకు పాల్పడ్డారని.. నేటికీ వారి దుర్మార్గాలు ఆగడం లేదన్నారు. రెండు జిల్లాలకు 2025లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌లు బలపర్చిన కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. నాయకులు పట్టభద్రులందర్నీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ రాజకీయ అనుభవం గల నేత రాజేంద్రప్రసాద్‌కు అందరి మద్దతు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యమైనవన్నారు. ఈ సందర్భంగా ఆలపాటి, అశోక్‌బాబులను రాము సత్కరించారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జి, డాక్టర్ గోర్జి సత్యనారాయణ, కాకొల్లు భస్మాకరరావు, శాయన పుష్పావతి తదితర నేతలు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధిపై దృష్టి సారించండి : ఎమ్మెల్యే రాము

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రతి పల్లె అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. స్థానిక ప్రజావేదిక తెదేపా కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న పల్లె పండగ కార్యక్రమాన్ని విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల వారీగా కొనసాగుతున్న పనులపై ఆయన సమీక్షించారు. గుడివాడ మండలంలో రూ.4.37 కోట్లతో 79 సీసీ రోడ్లు, రూ.2.40 కోట్లతో 12 డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. రూ.1.06 కోట్లతో మినీ గోకులం అభివృద్ధి పనులు చేపడతామన్నారు. నందివాడ మండలంలో రూ.4.30 కోట్లతో 59 సీసీ రోడ్లు, రూ.2.40 కోట్లతో 18 సీసీ డ్రెయిన్లు, గుడ్లవల్లేరు మండలంలో రూ. 10.13 కోట్లతో 78 సీసీ రోడ్లు, 22 సీసీ డ్రెయిన్లు, రూ.87 లక్షలతో మినీ గోకులం నిర్మించనున్నట్లు చెప్పారు. జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, ఎంపీడీవోలు విష్ణు ప్రసాద్, మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ సారధి, అధికారులు సూరిబాబు, రామకృష్ణ, ఇమ్రాన్, అట్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ విద్యా కుటుంబం సేవలు అభినందనీయం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: నియోజకవర్గ విద్యాకుటుంబం సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. రూ.29,78,185తో 2,600 మంది వరద బాధిత కుటుంబాలకు వంటపాత్రలు, దుప్పట్లు పంపిణీ విజయవంతం చేసిన సందర్భంగా ఎంఈవోలకు, ఉపాధ్యాయ సంఘాల నాయకులను ఎమ్మెల్యే అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో మరో 300 వరద బాధిత కుటుంబాలకు సాయం చేయాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. ఎంఈవోలు టీవీఎం.రామదాసు, వి.శ్రీనివాసరావు, జీఎన్‌బీ గోపాల్, ఎ.పిచ్చయ్య ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, విజయ సాంబశివరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రవివర్మ, డీపీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చు రాఘవ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. పరిహాసం

పంటలు దెబ్బతిన్నా అందని పరిహారం

అధికారులు, ప్రజాప్రతినిధుల్ని నిలదీస్తున్న అన్నదాతలు

న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

కృష్ణా నదికి భారీగా వరదలొచ్చి వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి 15 రోజుల్లోనే బాధిత రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ చేసింది. ఏ ప్రభుత్వం ఇంత త్వరగా పరిహారం అందించిన ఘటన చరిత్రలో లేదని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. అంత వరకూ బాగానే ఉన్నప్పటికీ వాస్తవంగా నష్టపోయిన రైతుల పేర్లను నమోదు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా పత్రాలు సమర్పించిన రైతులకు అరకొర పరిహారం చెల్లించి మిగతా సొమ్ము బినామీల పేరుతో కొల్లగొట్టేశారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పరిహారం చెల్లించినవారి జాబితాలు బయట పెట్టాలని రైతులు కోరుతున్నా అధికారులు ప్రదర్శించకపోవడంతో ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. సాగులో లేని భూములకు బినామీల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమైందని.. పంటలకు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయిన కొంత మందికి ఎందుకు చెల్లించలేదని అన్నదాతలు అధికారుల్ని ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమకు పంట నష్టపరిహారం అందలేదని రైతులు లబోదిబోమంటున్నారు. సొసైటీ భూముల్లో పంటలు వేసి తీవ్రంగా నష్టపోయిన నిరుపేద ఎస్సీ రైతులకు పరిహారం నమోదు చేయలేదు. అదే భూముల్లో పంట వేయకుండా కొంత మంది రైతుల పేర్లు ఎలా నమోదు చేశారని అధికారుల్ని నిలదీస్తున్నా సమాధానం ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు.




లంకల్లో వరదకు దెబ్బతిన్న పసుపు పంట (పాత చిత్రం)

జాబితాలపై గోప్యత ఎందుకో?

నిబంధనల ప్రకారం నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేసిన తర్వాత జాబితాను రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో ప్రదర్శించాలి. కానీ అధికారులు వారికి నచ్చినవారి పేర్లతో రహస్య జాబితా రూపొందించి ప్రభుత్వానికి పంపారు. దీంతో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేయలేకపోయారు. అలాగే రైతుల ఖాతాల్లో డబ్బులు వేసినవారి జాబితా కూడా ప్రదర్శించాల్సి ఉన్నా అధికారులు ఇంత వరకూ బహిర్గతం చేయడం లేదు. దీనిపై రైతులు స్థానిక నాయకులను కూడా నిలదీస్తున్నారు. రైతుల పంటల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మండలంలోని ఓ రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఈ విషయం తెలిస్తే మిగతా అక్రమాలు బయటపడతాయనే భయంతో అధికారులు గోప్యత పాటిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. రైతుల శ్రమ గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు న్యాయం చేస్తుంటే.. ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలనే ఉద్దేశంతో కిందిస్థాయి అధికార యంత్రాంగం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని స్థానిక నాయకులు విమర్శిస్తున్నారు. ఈ సమస్యలపై పలువురు రైతులు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

మూడుసార్లు పత్రాలిచ్చాను



లంకలో ఎకరం పొలంలో పసుపు పంట వేసి రూ.లక్ష పెట్టుబడి నష్టపోయాను. అధికారులకు మూడు సార్లు పత్రాలు సమర్పించాను. ఇప్పటికీ రైతు సేవా కేంద్రం చుట్టూ తిరుగుతున్నాను. పొరుగు రైతులకు పరిహారం వచ్చింది.. నాకు మాత్రం రాలేదు. నష్టపరిహారం అందని రైతులు చాలా మంది ఉన్నారు.

– మర్రెడ్డి బసవిరెడ్డి, రైతు చాగంటిపాడు

1.3 ఎకరాల్లో సాగు చేస్తే 30 సెంట్లకే ఇచ్చారు



లంకలో ఎకరం 30 సెంట్లలో అరటి సాగు చేశాను. వాటికి సంబంధించిన పత్రాలు అధికారులకు అందజేశాను. కానీ 30 సెంట్లకు మాత్రమే పరిహారం సొమ్ము జమ అయ్యింది. అధికారులను అడుగుతుంటే సమాధానం చెప్పడం లేదు.

– అవుతు నాగిరెడ్డి, రైతు, చాగంటిపాడు

2027 వరకు విశ్వకర్మ కౌశల్ యోజన

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ కౌశల్ యోజన ప్రవేశపెట్టిన 10 నెలల్లోనే రాష్ట్రంలో 34 వేల మందికిపైగా చేతివృత్తుల వారు లబ్ధి పొందారని భాజపా నాయకుడు యర్రపోతు అర్జున్ తెలిపారు. స్థానిక భాజపా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ పేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ 18 రకాల చేతి వృత్తులవారికి వారి ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు ఈ పథకాన్ని రూపొందించారన్నారు. గుడివాడలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఎదురుగా చేతివృత్తుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని.. 2027 వరకూ ఈ పథకం అందుబాటులో ఉంటుందన్నారు. విశ్వకర్మ కౌశల యోజన జిల్లా కన్వీనర్ గానుగుల రాజా, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మాకాని జనార్దన్, నందివాడ మండల అధ్యక్షుడు వాసుపల్లి రామ్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

కంప్యూటర్ వితరణ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: పెదకళ్లేపల్లికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ తరపున ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె.ఉమామహేశ్వరరావు, సిబ్బందికి మంగళవారం రూ.40 వేలు విలువ చేసే కంప్యూటర్ అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం జరిగిన సంస్థ అధ్యక్షుడు బండారు మధుబాబు, విద్యా కమిటీ ఛైర్మన్ చూడే శ్రీను, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

కురుమద్దాలి(పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేకుండా చేసి వారి జీవితాలను నాశనం చేసిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మంగళవారం పామర్రు మండలం కురుమద్దాలిలో ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కల్పనశాఖ, డీఆర్‌డీఏ- డీడాప్ సంయుక్తాధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ మాట్లాడారు. అనంతరం టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్, సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, డి.మార్ట్, ఇన్నోవ్ సోర్స్, నవతా ట్రాన్స్‌పోర్టు కంపెనీల ప్రతినిధులు పదో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్హతలతో హాజరైన 208 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి 58 మందిని ఎంపికచేశారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

తెదేపా నాయకులపై కేసులు కొట్టివేత

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఇతర నాయకులు, కార్యకర్తలు బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడుతుంటే గత వైకాపా ప్రభుత్వం వేధింపుల్లో భాగంగా బనాయించిన అక్రమ కేసును గుడివాడ కోర్టు వారు మంగళవారం కొట్టివేశారని ఎమ్మెల్యే తెలిపారు.

భార్యపై భర్త దాడి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: భర్త తరచూ మద్యం తాగొచ్చి తనపై దాడులకు పాల్పడుతున్నాడని ఓ వివాహిత మంగళవారం ఫిర్యాదు చేశారని గుడివాడ తాలూకా పోలీసులు తెలిపారు. లింగవరం గ్రామానికి చెందిన కుప్పాల బాలాజి, ఝాన్సీలకు 16 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. ఝాన్సీ భర్త మద్యానికి బానిసై తరచూ ఆమెను కొడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ నెల 4న రాత్రి 10 గంటల సమయంలో తాగొచ్చి ఝాన్సీని కొడుతూ ఆమె తలను గోడకు మోదాడు. దీంతో ఆమె తల వెనుక రక్త గాయమైంది. ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి మంగళవారం ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

మోపిదేవి, న్యూస్‌టుడే: మద్యం తాగి పనులకు వెళ్లకుండా తనపై దాడిచేస్తున్నడంటూ భార్య తన భర్తపై ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ మంగళవారం పేర్కొన్నారు. మోపిదేవి పంచాయతీ శివరు గంజివానిపాలెనికి చెందిన గుడివాడ సంధ్యారాణి, మచిలీపట్నానికి చెందిన భానుప్రకాశ్ 2015లో వివాహం చేసుకున్నారు. రోజూ తాగి, ఇంటి అవసరాలు పట్టించుకోకుండా డబ్బులు, ఉంగరం ఇవ్వమని తనను వేధిస్తున్నాడని, ఈ క్రమంలో తలమీద కర్రతో కొట్టినట్లు సంధ్యారాణి భర్తపై ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పరస్పర ఫిర్యాదులతో కేసులు


మోపిదేవి, న్యూస్‌టుడే: పెదప్రోలుపంచాయతీ శివారు కప్తాన్‌పాలెం మట్టావానిగూడెంలో ఇరు కుటుంబాలు పరస్పర ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నడకుదురు రాఘవులు-కొల్లూరు వెంకటేశ్వరరావులకు కొంతకాలంగా ఇంటి ముందు మురుగు సమస్య నెలకొంది. తరచూ గొడవ పడుతుండేవారు. కొల్లూరు వెంకటేశ్వరరావు కుమారుడు నాగమల్లేశ్వరరావు రాఘవులుతో గొడవపడి తలపై గాయం చేశాడు. ఈ ఘర్షణలో ఇద్దరికి గాయాలు కావడంతో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉయ్యూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శేషగిరిరావు మంగళవారం తెలిపారు. తోట్లవల్లూరు మండలంలోని మూడు మద్యం దుకాణాలు ఉండగా వాటికి ఇప్పటి వరకు 22 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 9న సాయంత్రం 5 గంటల లోపు ఆశావహులు దరఖాస్తులు చేసుకోవాలని సీఐ సూచించారు.

ధనలక్ష్మీ నమోస్తుతే..

దేవీ శరన్నవాత్రి వేడుకలు గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో మంగళవారం కూడా వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అమ్మవార్లను అత్యధిక దేవాలయాలు, పందిళ్లలో ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. మరికొన్ని చోట్ల వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించారు. పలు చోట్ల ముత్తయిదువ, సుహాసిని పూజలు, చండీయాగం, శ్రీచక్రార్చనలు, స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో, ప్రత్యేక పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం



అవనిగడ్డలో..



విశ్వనాథపల్లిలో ..



కోడూరులో..



వేకనూరులో..



చల్లపల్లి: మహాలక్ష్మీదేవిగా..



మోపిదేవి బస్టాండ్ కూడలిలో..



పెదకళ్లేపల్లిలో దుర్గాదేవికి విశేష అలంకరణ



చల్లపల్లి: రామానగరంలో..



జొడుగూడెంలో..



శ్రీకాకుళం ముదిరాజుల రామాలయంలో కుంకుమార్చన



మొవ్వ రాజ్యలక్ష్మి అమ్మవారు



కూచిపూడిలో..



తోట్లవల్లూరు: మహాలక్ష్మీదేవిగా..



పెదపారుపూడి: వెంట్రప్రగడ నామేశ్వరస్వామి దేవస్థానంలో..



నాగాయలంక : శ్రీరామపాద క్షేత్రంలో..




నాగాయలంక యల్లారమ్మ అమ్మవారు



పామర్రు : ధనలక్ష్మీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



నాగాయలంక కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



పామర్రు : అలంకారంలో అంకమ్మతల్లి



కొండిపర్రు భ్రమరాంబ



కోసూరు క్షత్రియ రామాలయం వద్ద దుర్గాదేవి

మిశ్రమ ఎరువులు, బయో ఫర్టిలైజర్లు అమ్మరాదు

నాగాయలంక, న్యూస్‌టుడే: ఎరువుల దుకాణాల్లో మిశ్రమ ఎరువులు, బయో ఫర్టిలైజర్లు అమ్మరాదని, అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు జె.ఎస్.జయప్రద అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని ఎరువుల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఎరువులు అమ్మిన వెంటనే ఈ పాస్ యంత్రంలో నమోదు చేయాలని తెలిపారు. ఏవో టి.శుభహారిక, వ్యవసాయ సహాయకులు, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

పామర్రు, న్యూస్‌టుడే: పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సొసైటీ ధ్యేయమని సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పాల సొసైటీలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. 315 మంది రైతులకు సొసైటీ ద్వారా రూ.1,79,333 పంపిణీ చేశామన్నారు.

విద్యుత్తు సమస్యలుంటే తెలపండి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల వినియోగదారులు విద్యుత్తు సంబంధిత సమస్యలుంటే తమ ప్రాంత ఏఈలకు తెలపాలని ఏడీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. 9440817578 అవనిగడ్డ (ఏడీఈ), 0440812160 (ఏఈ అవనిగడ్డ), 9440812164 (ఏఈ కోడూరు), 0440812163 (ఏఈ నాగాయలంక)ను సంప్రదించాలని చెప్పారు.

35 మందికి ఉద్యోగాలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధికల్పనా శాఖ, డీఆర్‌డీఏ, సిడాప్ సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగ మేళాలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేశారు. స్కిల్‌హబ్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వరరావు, ఎకనామిక్స్ అధ్యాపకురాలు ఎ.వీరకుమారి, జి.పృథ్వీజా, ఆర్ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

శాస్త్రవేత్తకు రైతుల సత్కారం

ఘంటసాల: ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.శ్రీలత బదిలీపై గుంటూరు వెళ్తున్న సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు, పలు గ్రామాల రైతులు మంగళవారం ఆమెను సత్కరించారు. ఆమె అందించిన వ్యవసాయ పరమైన సేవలను కొనియాడారు. కేవీకే శాస్త్రవేత్తలు వి.మంజువాణి, కె.రేవతి, బి.నవీన్, జె.యశ్వంత్‌కుమార్, వెంకటలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు పంచాయతీ సభ్యుల గైర్హాజరు

పమిడిముక్కల: పంచాయతీ ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులకు సగం మందికిపైగా సభ్యులు గైర్హాజరైనట్లు ఎంపీడీవో విక్టర్‌పాల్ తెలిపారు. వ్యవసాయ సీజన్ కావడంతో రాలేమని చెబుతున్నట్లు పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు అనుమతులివ్వొద్దు

ఘంటసాల, న్యూస్‌టుడే: నివాస గృహాల మధ్య మద్యం దుకాణాలకు అనుమతివ్వొద్దని ఘంటసాల గ్రామస్థులు కోరారు. మంగళవారం విలేకరుల సమావేశం వారు మాట్లాడుతూ సత్రం సెంటర్ సమీపంలో మల్లంపల్లి రోడ్డు పక్కన బ్రాందీ షాపు ఉండడంతో ప్రయాణికులు, మహిళలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్రాందీ షాపునకు చుట్టుపక్కల బెల్ట్ షాపులు ఉండడంతో మహిళలకు ప్రయాణం మరింత కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈనాడు సినిమా

రామ్‌చరణ్ - ప్రశాంత్ నీల్ కలయికలో!


రామ్‌చరణ్

రామ్‌చరణ్ సినిమాల విషయంలో వేగం పెంచుతున్నారు. ప్రస్తుతం ఆయన బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమాని పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. దీని తర్వాత సుకుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం చేసేందుకు పచ్చజెండా ఊపారు. ఇప్పుడీ జాబితాలో కొత్తగా మరో ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్', 'సలార్' విజయాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇప్పుడాయనతో చరణ్ ఓ సినిమా చేయనున్నారని సమాచారం. ఇప్పటికే దీనిపై చర్చలు పూర్తయినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌ను డీవీవీ దానయ్య నిర్మించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రశాంత్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో ఓ సినిమా చేసేందుకు సిద్ధమయ్యారు. దీని తర్వాత 'సలార్ 2', 'కేజీఎఫ్ 3' పూర్తి చేయాల్సి ఉంది. వాటి తర్వాతే రామ్‌చరణ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశముంది. ఈలోపు బుచ్చిబాబు, సుకుమార్‌ల సినిమాలు పూర్తి చేయనున్నారు చరణ్.

ఆ రోజు విడుదల పక్కా


అల్లు అర్జున్

బాక్సాఫీస్ తుపాన్‌ని వీక్షించడానికి సిద్ధంగా ఉండాలంటూ ప్రేక్షకులకు పిలుపునిచ్చింది 'పుష్ప 2' బృందం. 'పుష్ప2' మొదటి సగ భాగం ఎడిటింగ్ పూర్తి చేసుకుని లోడ్ అయిపోయిందని, అంచనాల్ని మించి సినిమా ఉంటుందని చిత్రబృందం స్పష్టం చేసింది. చిత్రం డిసెంబరు 6న విడుదల పక్కా అని పునరుద్ఘాటిస్తూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాల్ని పేర్కొంది. 'పుష్ప' చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రం 'పుష్ప2'. అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా మరోవైపు నిర్మాణానంతర పనుల్ని పూర్తి చేసుకుంటోంది.


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పురస్కారం స్వీకరిస్తున్న మిథున్ చక్రవర్తి


రిషబ్‌శెట్టి


నిత్యామేనన్


మానసీ పరేఖ్

సమాజాన్ని మార్చడంలో సినిమాలదీ కీలక పాత్రే!


అభిషేక్ అగర్వాల్


చందూ మొండేటి

- జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును స్వీకరించిన మిథున్ చక్రవర్తి

"భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా సినిమాల్ని రూపొందిస్తోంది భారతీయ సినీరంగం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద చిత్రపరిశ్రమ మాత్రమే కాదు.. కళారంగంలోనే ఎంతో వైవిధ్యమైనది" అన్నారు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. మంగళవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 70వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో విజేతలకు పురస్కారాలు అందించారు ముర్ము. ఇందులో భాగంగా భారతీయ చలన చిత్రపరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డుతో నటుడు మిథున్ చక్రవర్తిని సత్కరించారు రాష్ట్రపతి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ రోజు దాదాపు 85మంది పురస్కారాల్ని అందుకున్నారు. అందులో మహిళలు కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. చిత్రపరిశ్రమలో మహిళల్ని ప్రోత్సహించేలా భవిష్యత్తులో మరిన్ని చిత్రాలు తీయడానికి దర్శకనిర్మాతలు ప్రయత్నిస్తారని ఆశిస్తున్నాను. సమాజాన్ని మార్చడంలో సోషల్ మీడియాతో పాటు సినిమా కూడా కీలకమైన పాత్ర పోషిస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్‌తో పాటు అవార్డుల జ్యూరీ బృందం పాల్గొంది.

- ఈ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో 'కాంతార' చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన కన్నడ కథానాయకుడు రిషబ్‌శెట్టి ఉత్తమ నటుడిగా పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ నటిగా నిత్యామేనన్ (తిరుచిత్రాంబళం), మానసీ పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) అవార్డుల్ని సొంతం చేసుకున్నారు. ఉత్తమ చిత్రంగా 'ఆట్టమ్' (మలయాళం), ఉత్తమ దర్శకుడిగా సూరజ్ బర్జాత్యా (ఊంచాయీ) పురస్కారాల్ని గెలుచుకున్నారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచిన 'కార్తికేయ 2'కు గానూ దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ పురస్కారాల్ని అందుకున్నారు.

డబ్బులేదని ఆశయాలు వదలొద్దు

దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని స్వీకరించాక మిథున్ చక్రవర్తి స్పందిస్తూ.. "ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును తీసుకున్నందుకు నాకు గర్వంగా ఉంది. నా జీవితంలో ఏదీ అంత సులువుగా రాలేదు. ఎంతో కష్టపడ్డాను. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం మీ ఆశీసులే అని నమ్ముతాను. మనదేశంలో ప్రతిభావంతులు చాలా మంది ఉన్నారు. నేను వారికి చెప్పాలనుకునేది ఒక్కటే. మీ దగ్గర లేనిది డబ్బు మాత్రమే.. అందుకోసం మీ ఆశయాలను ఎప్పుడూ వదులుకోకండి. కలలు కనండి వాటిని నెరవేర్చుకోవడం కోసం శ్రమించండి" అని చెప్పారు.

ఓ అందమైన ప్రయాణం... విశ్వం


టి.జి.విశ్వప్రసాద్, గోపీచంద్, శ్రీను వైట్ల, కావ్య థాపర్, వేణు దోనేపూడి

"నేను చాలా సినిమాలు చేశా. 'విశ్వం' ప్రయాణం ఎంతో సౌకర్యంగా అనిపించింది. అందుకు కారణం దర్శకుడు శ్రీను వైట్ల. ఆయన కథ చెబుతున్నప్పుడు, సెట్‌లో నటిస్తున్నప్పుడు బాగా నవ్వుకునేవాళ్లం. ఈ కథలో అంత అద్భుతంగా కామెడీ పండింది. యాక్షన్ కూడా అదే స్థాయిలో ఉంటుంద"ని చెప్పారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'విశ్వం'. కావ్య థాపర్ కథానాయిక. శ్రీనువైట్ల దర్శకుడు. వేణు దోనేపూడి, టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. దసరా సందర్భంగా ఈ నెల 11న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. గోపీచంద్ మాట్లాడుతూ "'విశ్వం' శ్రీనువైట్ల మార్క్ సినిమా. ఈ సినిమాతో శ్రీనువైట్ల తన పూర్వ వైభవాన్ని చాటుతారన్నారు. శ్రీనువైట్ల మాట్లాడుతూ "ఈ సినిమా ఓ అందమైన ప్రయాణం. ఈ చిత్రం అందరికీ వినోదాన్ని పంచుతుందని వందశాతం నమ్మకంతో చెబుతున్నా" అన్నారు. కార్యక్రమంలో కావ్య థాపర్, టి.జి.విశ్వప్రసాద్, వేణు దోనేపూడి, శ్రీరామ్ ఆదిత్య, మహేశ్, అనీషా ఆంబ్రోస్, చేతన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


సమంత, అలియా భట్

తెలుగు ప్రేక్షకుల్ని మించినోళ్లు లేరు: అలియా

"కొన్ని సినిమాల ట్రైలర్లు, ప్రచార చిత్రాలు చూస్తుంటే అవి మనల్ని 'రా.. చూడు' అని పిలుస్తున్నట్లు ఉంటుంది. ఈ 'జిగ్రా' ట్రైలర్ చూశాక నాకదే అనుభూతి కలిగింది" అన్నారు దర్శకుడు త్రివిక్రమ్. అలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో వాసన్ బాలా తెరకెక్కించిన చిత్రమే 'జిగ్రా'. ధర్మ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్, ఎటర్నల్ షైన్ ప్రొడక్షన్స్ సంస్థలు నిర్మించాయి. ఈ సినిమాని ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా రానా దగ్గుబాటి ఈ నెల 11న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుకను నిర్వహించారు. దర్శకుడు త్రివిక్రమ్, నటి సమంత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలియా భట్ మాట్లాడుతూ.. "ఆర్ఆర్ఆర్' ద్వారా నాకు తెలుగు భాషతో ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. మంచి సినిమాల్ని ఆదరించడంలో తెలుగు ప్రేక్షకుల్ని మించిన వారు లేరు. కచ్చితంగా 'జిగ్రా' అందరికీ నచ్చుతుంది" అంది. ఈ కార్యక్రమంలో రానా, వాసన్ బాలా, వేదాంగ్, రాహుల్ రవీంద్రన్ తదితరులు పాల్గొన్నారు.


ఆఖరి దశలో ఓదెల 2

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

అన్నదానం.. మహోన్నతం!



- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

మహాక్రతువుకు రూ.101.44 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు

దసరాల్లో నిత్యం 20 వేల మందికి..


జగన్మాత దీవెనతో..

'అన్నం పరబ్రహ్మ స్వరూపం'

అని భారతీయ సనాతన ధర్మం బోధిస్తుంది. అన్ని దానాల్లో సంతృప్తి కలిగించే ఏకైక దానంగా భావిస్తారు. ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అన్నదానం ట్రస్టు పేరుతో 1991 జనవరి 1న రూ.15 లక్షల నిధులతో అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ ట్రస్టులో 58 మంది సభ్యులు ఉన్నారు. 2024 జూన్ 1 నాటికి 1,60,403 మంది దాతలు ఇందులో చేరారు. దాతలు ఇచ్చిన వాటిని 60 ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రూ. 101,44,97,365 ఉంది. వీటిపై సంవత్సరానికి రూ. 7,26,52,247 వడ్డీ వస్తుంది. ఇది కాక నిత్యం దాతలు ఇచ్చే విరాళాల ద్వారా రూ. 15,92,735 సరాసరి వస్తోంది. అన్నప్రసాదంతోపాటు దసరాల్లో భక్తులకు ఉదయం, సాయంత్రం 30 వేల మంది భక్తులకు అల్పాహార పంపిణీకి కూడా ఏర్పాట్లు చేశారు. దద్దోజనం, కట్టె పొంగలి ప్రసాదాలను భక్తులకు వితరణ చేస్తున్నారు.

విరాళాలపై వచ్చిన వడ్డీతో ..

దాతలు ఇచ్చిన విరాళాలపై వచ్చే వడ్డీతో మాత్రమే భక్తులకు ఉచిత అన్నప్రసాదంగా దేవస్థానం పంపిణీ చేస్తోంది. సాధారణ రోజుల్లో 4 వేల మందికి, శుక్ర, ఆదివారాల్లో 5 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేస్తారు. దసరా ఉత్సవాల పది రోజులు, భవానీ దీక్షల ఐదురోజులు కలిపి 3 లక్షల మందికి అన్నప్రసాదాన్ని దేవస్థానం అందజేస్తోంది.


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

అత్యంత రుచికరం...

భక్తులు కడుపు నిండేలా ఆహారం పెట్టేందుకు దేవస్థానం అధికారులు మెనూ నిర్ణయించారు. ప్రతి రోజు పులిహోర ప్రసాదం, అన్నం, పప్పు, కూర, పచ్చడి, సాంబారు, మజ్జిగతో అన్నప్రసాదం పంపిణీ చేస్తారు. సుమారుగా ప్రతి భక్తుని కోసం రూ.51 చొప్పున ఖర్చు చేస్తున్నారు.





రూ.30 కోట్లతో నూతన భవనం...

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం రూ.30 కోట్లతో నూతన అన్నదాన భవన నిర్మాణం చేపడుతోంది. బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం అదేస్థలంలో పిల్లర్ల నడుమ వ్యయప్రయాసలకు ఓర్చి భక్తులకు అన్నప్రసాద పంపిణీకి తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. పది రోజుల కిందట వరకు అడుగు తీసి వేయలేని పరిస్థితి నుంచి భక్తులు క్యూలైన్లో వెళ్లి అన్నదానం స్వీకరించే వీలుగా ఏర్పాట్లు చేశారు.

మరిన్ని షామియానాలు వేస్తాం

- దేవస్థానం డీఈ రవీంద్ర

అన్నదాన భవనం నిర్మాణంలో ఉన్నందున పిల్లర్లు అడ్డుగా వచ్చిన చోట షామియానా వేయలేదు. ఆప్రాంతానికి తగినట్లు చిన్న షామియానా వేసేందుకు చర్యలు తీసుకుంటాం. మూలా నక్షత్రం నుంచి భక్తులు లక్షలాదిగా తరలి వస్తారు. అందుకు తగినట్లు క్యూలైన్లలో ఏర్పాట్లు చేస్తాం.

అత్యంత ఇష్టంగా స్వీకరిస్తాం



దుర్గగుడి అన్నప్రసాదాన్ని అత్యంత ఇష్టంగా స్వీకరిస్తాం. దేవస్థానం భక్తుల కోసం స్వీటు, పులిహోర, సాంబారు, కూర, చట్నీ, పప్పు ఏర్పాటు చేయడంతో ఇంటి భోజనం కంటే మిన్నగా ఉంది. భక్తులకు సరిపోయేలా కూర, పప్పు రెండోసారి కూడా వేస్తే బాగుంటుంది.

– సుచరిత, సనీత, యశస్విన్ (సత్యనారాయణపురం)

చాలా బాగుంది..



దేవస్థానం అన్నప్రసాదం చాలా బాగుంది. అయితే అన్నదాన భవనం నిర్మాణంలో ఉన్నందున కొంత మేర మాత్రమే షామియానాలు వేశారు. ఎండలో ఎక్కువ సేపు వేచి ఉండే వారికి ఇబ్బంది ఎదురవుతోంది. ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురావాలి.

– అవులయ్య, గురవమ్మ (చెన్నంపల్లి, ప్రకాశం జిల్లా)

అమ్మ అనుగ్రహంతో



అమ్మవారి దర్శనానికి వచ్చినప్పుడల్లా అన్నప్రసాదం స్వీకరిస్తాం. ఇంట్లో భోజనం కంటే రుచిగా, శుచిగా ఉంటుంది. అమ్మవారి అనుగ్రహం ఉన్నంత వరకు భక్తుల అన్నప్రసాద పంపిణీకి లోటు ఉండదు. దసరా ఉత్సవాల్లో సైతం అదే నాణ్యతతో భక్తులకు అందజేస్తున్నారు.

- నాగలక్ష్మి, దుర్గ (కృష్ణలంక)

వీఐపీలు దర్శన వేళలు పాటించాలి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: వీఐపీలు దర్శన వేళలు పాటించి సామాన్య భక్తులకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై మహాలక్ష్మి అలంకారంలో కొలువుదీరిన దుర్గమ్మను డీజీపీ ద్వారకా తిరుమలరావు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలా నక్షత్రం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు సిబ్బంది సమయోచితంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీ రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.


డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు, పక్కన సీపీ రాజశేఖర్‌బాబు

బెంగళూరు పుష్పాలతో అంతరాలయం ధగధగ

రోజూ సుమారు రూ. 1.50 లక్షల ఖర్చు




వివిధ రకాల పూలతో తీర్చిదిద్దిన అంతరాలయం

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో ప్రతి రోజూ అంతరాలయంలో నిర్వహిస్తున్న పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. బెంగళూరు, మహారాష్ట్ర, కర్ణాటక, ఊటీ తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక పుష్పాలతో ఆలయ సన్నిధిని అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. సుమారు 50 మందికిపైగా కార్మికులు ప్రతి రోజూ రాత్రి 11.30 నుంచి ప్రారంభించి తెల్లవారుజాము 2.30 వరకు అలంకరణ చేస్తున్నారు. పింక్ గ్లాడ్, పర్పుల్ గ్లాడ్, నైట్ గ్లాడ్, పింక్‌సోలో బాల్స్, నైట్‌గ్లేడర్, బ్లూడైస్, నైట్ డైస్ తదితర ప్రత్యేకమైన పుష్పాలు ఆలయంలో కనువిందు చేస్తున్నాయి. పుష్పాలంకరణకు ప్రతి రోజూ సుమారు రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మూలా నక్షత్రంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సారి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనుండడంతో బుధవారం రోజు ప్రత్యేక అలంకరణతో ఆలయాన్ని మరింత అందంగా తీర్చిదిద్దనున్నట్లు అంతరాలయ పుష్పాలంకరణ ఇన్‌ఛార్జి కొండాయిగుంట బలరామ్ తెలిపారు.

కాణిపాకం గణపయ్య తరఫున సారె సమర్పణ


సారె తీసుకొస్తున్న కాణిపాకం ఆలయ ఈవో గురుప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, సీపీ రాజశేఖర్‌బాబు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని జగన్మాత దుర్గమ్మకు కాణిపాకం వినాయక దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు, సారెను మంగళవారం సమర్పించారు. ఈవో గురుప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు మేళతాళాల నడుమ సారెను ఈవో రామారావు, వైదిక కమిటీ సభ్యులకు అందజేశారు. తొలుత వారికి దుర్గగుడి ఏసీ సాంబశివరావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

సత్యదేవుని సన్నిధి నుంచి...

చిట్టినగర్, న్యూస్‌టుడే: మహాలక్ష్మిగా కొలువుదీరిన విజయవాడ దుర్గమ్మకు మంగళవారం అన్నవరం దేవస్థానం తరఫున అధికార బృందం పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఆలయ ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ ఐవీ రోహిత్, ఏఈవో కొండలరావు, సిబ్బంది పసుపు, కుంకుమ, పండ్లు, పట్టు వస్త్రాలు తీసుకురాగా దుర్గ గుడి ఆలయ ఈవో, వేద పండితులు మేళతాళాలతో వారికి స్వాగతం పలికారు.


అమ్మవారికి సారె తెస్తున్న అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్, అధికారులు